
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 1 ఆగస్టు 2024 | 5





నిండుగా ప్రవహిస్తున్న గోదావరి

తగ్గిన గోదావరి

భద్రాచలం, ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న ఫస్ట్‌వార్నింగ్

- వివరాలు 8లో

రాజమహేంద్రవరం, జూలై31 (ఆంధ్రజ్యోతి) : గోదావరి వరద దోబూచులాడుతోంది. అప్పుడే తగ్గుతోంది.. అప్పుడే పెరుగుతోంది.. సుమారు రెండు వారాలుగా గోదావరి వరద కొనసాగుతూనే ఉంది. వరద ముంపు బాధితులు సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. పోలవరం స్పిల్‌వే నుంచి 9,53,451 క్యూసెక్కుల నీరు రాజమహేంద్రవరం అఖండ గోదావరి మీదుగా బ్యారేజీ వద్దకు వస్తోంది. అక్కడ నుంచి బ్యారేజీ గుండా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలను ముంచుతూ సముద్రంలోకి వెళుతుంది. గోదావరి వరద ఏజెన్సీ గ్రామాలు, కోనసీమలోనే ఎక్కువ నష్టం మిగిల్చింది. అంతే కాకుండా గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భద్రాచలం వద్ద ఉదయం 8 గంటలకు నీటిమట్టం 45 అడుగులకు పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు 45.10 అడుగులకు నెమ్మదిగా చేరి మధ్యాహ్నం 3 గంటలకు కాస్త తగ్గింది. 6 గంటలకు 44.90 అడుగులకు చేరింది. రాత్రి 11 గంటలకు 44.60 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.నీటిమట్టం 43 అడుగులకంటే తగ్గితే హెచ్చరికను ఉపసంహరించుకుంటారు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ నీటిమట్టం 12.10 అడుగులు వద్ద నిలకడగా ఉంది. బ్యారేజీ నుంచి ఉదయం 5 గంటలకు 10,60,023 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు.రాత్రి 11 గంటలకు 10,41,489 క్యూసెక్కులు సముద్రంలోకి వెళుతోంది. దిగువకు వెళ్లే నీరు 10 లక్షలకు దిగినా, నీటిమట్టం 11.75 అడుగుల కంటే తగ్గినా మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహ రించుకుంటారు.ఇక్క ట్రెండ్ తగ్గుముఖంగా ఉందని అధికార రిపోర్టులు చెబుతున్నాయి. ఇక ప్రవాహం ఉధృతంగానే ఉంది. అయితే లంకలన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. వరద ఉధృతి తగ్గితే లంకల్లో నీరు లాగుతోంది.

గోదారి.. బతుకులు!



దశాబ్దాలు గడచిపోతున్నాయి.. అయితేనేం వరదొస్తే నిల్చోవడానికి నిలువ నీడ లేదు.. కూర్చుందామంటే జాగాలేదు.. పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తేనే అక్కడే సేదతీరతారు.. వరద రెండు నెలలూ ఆ కేంద్రంలోనే కాలం గడిపేస్తారు.. మళ్లీ వరద తగ్గిందంటే మామూలే.. లంకలకు వెళ్లిపోతారు.. మళ్లీ వరదొచ్చే వరకూ గోదారమ్మ ఒడిలో చల్లగా సేదతీరతారు.. వరదొచ్చిందంటే ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాల బాటపడతారు.. ఇదీ 30 ఏళ్లకు పైనుంచి గోదావరి లంకల్లో నివాసం ఉండే మత్స్యకారుల పరిస్థితి.. వీళ్ల గురించి పట్టించుకున్న పాలకులు లేరు.. అధికారులు లేరు.. వరద ముంపు కారణంగా ప్రస్తుతం పునరావాస కేంద్రంలో ఉన్న మత్స్యకారులను పలకరించగా.. గోదావరిని విడిచి ఉండలేం.. వదిలిరాలేం.. కానీ గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇళ్లిస్తే గోదారిని చూసుకుంటూ బతికేస్తామని చెబుతున్నారు..

- గోదారి వదలలేరు.. బయటకు రాలేరు...
- వరదొస్తే.. మత్స్యకారుల జీవనం దుర్భరం
- రెండు నెలలు తప్పని పునరావాసం
- ప్రతి ఏడాది ఇంతే.. అయినా లంకావాసం
- ఇళ్లిస్తే బయటకు వస్తామంటున్న మత్స్యకారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రెక్కలకు చుక్కానీ తోడైతే గానీ డొక్కాడని జీవితాలు. వేటకెళ్తేనే పూట సాగేది.ఈ సుడిగుండాల జీవనయానంలో వరదల వేళ మరీ నరకం. గోదారమ్మ ఒడిలో గందరగోళ జీవనం. నెలల తరబడి లంకావాసం.. గోదారమ్మ ఉగ్రమైన రోజుల్లో ఏడాదికోమారు నగరంలో పునరావాసం. వరద తగ్గిన తర్వాత తిరిగి ఇళ్లకు వెళ్లే సరికి మిగిలేది బురద.. రగిలేది ఆవేదన. ఇదీ లంకల్లోని మత్స్యకార జీవితాల విదారక కథా చిత్రమ్.

నెలల తరబడి లంకావాసం..

జిల్లావ్యాప్తంగా లంక ప్రాంతాలు చాలా ఉంటాయి. అయితే వీటిలో కొన్ని లంకల్లో మాత్రమే మత్స్యకారులు జీవన సాగిస్తుంటారు.. వీళ్ల వర్షాకాలం, వరదల వేళ నరకం అనుభవిస్తు న్నారు. పాలకులు ఎంత మంది మారినా వారి బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు.గోదావరి మధ్యలో జాలర్లు తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే నివాసం ఉంటారు. ప్రస్తుతం ఎదుర్లమ్మలంక, కేతావారిలంక, బ్రిడ్జిలంక తదితర మరో రెండు లంకల్లో కలిపి వెయ్యి మంది వరకూ మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 30 ఏళ్లకు పైబడి నివసించేవారు చాలా మంది ఉన్నారు. ఆయా నివాసాల్లో దంపతులిద్దరూ వేటకు వెళితేనే కానీ పూటగడవదు.గోదావరికి వరదొస్తే మాత్రం నరకం చూస్తుంటారు.వరదొచ్చే రెండు నెలలూ తలదాచుకునేందుకు నీడ ఉండదు. కడుపు నింపుకునేందుకు వేట ఉండదు. పునరావాస కేంద్రాలే దిక్కు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవు తారు. ఇళ్లలోని సామగ్రిని పడవల్లో ఉంచి టార్పాలిన్లు కడతారు. గోదావరి శాంతించిన తర్వాత ఇళ్లకు వెళతారు. ప్రతి ఏడాది జరిగే తంతే అయినా వీళ్లు మారరు.. లంకలను వదిలి నగరంలోకి రారు.

ఏడాదికోమారు ఇలా ..

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం పునరావాసం కల్పించి తోడుగా నిలిచింది.గతేడాది వైసీపీ ప్రభుత్వంలో ధవళేశ్వరం వద్ద బ్యారేజీ వరద 28 అడుగులకు చేరింది.. అయినా పట్టించు కోలేదు. వరద పోటుకు భయపడి పడవల్లోనే రోజులు గడిపేవారు. ఉధృతి మరీ ఎక్కువైన సమ యంలో తమంతట తాముగా ఈ దరికి వచ్చి అధికారులను వేడుకుంటే దయతలచేవాళ్లు. పునరావాసం కల్పించినా అరకొరగానే సదుపాయాలు ఉండేవి. ఈ ఏడాది వరద లంక గట్లను తాకగానే ఉన్నతాధికారులు సైతం లంకల్లోకి పరు గులు పెట్టారు. పడవల్లో జాగ్రత్తగా మత్స్యకా రులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అల్కట్‌తోట మునిసిపల్ కల్యాణ మండపంలో 248 మంది, చందా సత్రంలో 198 మందికి యుద్ధ ప్రాతిపదికన కలెక్టర్ పునరావాస ఏర్పాట్లు చేయిం చారు. జిల్లా వ్యాప్తంగా 1421 కుటుంబాలకు పున రావాస పరిహారం కింద నిత్యావసర సరుకులతో పాటు 529 కుటుంబాలకు రూ.3 వేల చొప్పున అందించింది. వరద తగ్గే వరకూ పునరావాస శిబి రాలు కొనసాగిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేయడం మత్స్యకారుల్లో మనోధైర్యాన్ని నింపింది.

గూడు కల్పిస్తే..

లంకల్లో మత్స్యకారులకు వేట ఒకటే జీవనాధారం. రోజూ వేట సాగించి వాటిని అమ్ముకొని జీవితాలు సాగిస్తారు. వరదల వేళ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పడవలు ఒడ్డుకు చేరక తప్పదు.దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రతి ఏడాదీ ఈ నరకం తప్పడం లేదని.. నగర పరిధిలో గోదావరి సమీపంలో తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తే చాలా వరకూ ఇబ్బందులు తప్పుతాయని మత్స్యకారులు చెబుతున్నారు.ఎందుకంటే ప్రభుత్వాలు పునరావాసం కల్పిస్తున్నా నరకం తప్పదు. లంకల్లోని ఇళ్ల వద్ద ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లను వరదల వేళ వదిలి వేస్తుంటారు. దీంతో రోజూ ఉగ్ర గోదావరిపై పడవలో వెళ్లి మూగజీవాలను గమనించుకుంటూ ఉంటారు. ప్రతి ఏడాది చాలా పశువులు గోదారికి బలైపోతుంటాయి. పడవలకు ఒడ్డున లంగరు వేస్తారు. ఈదురుగాలులు, వరద ఉధృతికి మోకులు లూజు కావడం, లంగరు పైకి రావడం జరుగుతుంది. ఆ పరిస్థితుల్లో పడవలు గల్లంతైపోతాయి. ఒక్కో ఇంజను బోటు ఖరీదు సుమారు రూ.3 లక్షలు. మహిళలు పునరావాస కేంద్రంలో తలదాచుకోగా.. మగవారు పడవలకు కాపలాగా ఉంటారు. వీళ్లకు భోజనాలకు ఇబ్బంది అయినా ఒక్కో పూట తిండి లేకపోయినా పడవలే జీవనాధారం కాబట్టి వాటి వద్దే కనిపెట్టుకొని ఉంటారు. అందువల్ల దాతలు కూడా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

30 ఏళ్లుగా లంకలోనే



మాది బ్రిడ్జి పేట.. 30 ఏళ్లగా అక్కడే ఉంటున్నాం. లంకల్లో చాలా సదుపాయాలు సొంతగా ఏర్పాటు చేసుకున్నాం. వరదలు వచ్చినప్పుడు నరకం చూస్తున్నాం. పైనుంచీ ఈ బాధ అనుభవిస్తున్నాం. గోదావరి లాగిన తర్వాత ఇంటికి వెళితే బురద శుభ్రం చేసుకోడానికి నెల పడుతుంది. మాకు ఇంటి సదుపాయం కల్పిస్తే ఊళ్లోకి వచ్చేస్తాం. - కర్రి నూకరత్నం, బ్రిడ్జిలంక

బ్రిడ్జి నిర్మాణంలో పని చేశా..



ఆర్చి బ్రిడ్జి నిర్మాణంలో పని చేశా. అప్పట్లో రూ.50 కూలీ ఇచ్చేవారు. అంతకు ముందు నుంచే లంకల్లో బతుకుతున్నాం. రాత్రివేళల్లో భయంగా ఉంటుంది. వరద లాగిన తర్వాత విష ప్రాణులతో ప్రమాదకరంగా ఉంటుంది. ఇళ్లకు వెళ్లే సరిగి గోడలకు, చెట్లకు పాములు వేలాడుతూ ఉంటాయి. కర్రి దుర్గయ్య, బ్రిడ్జిలంక

పాలకులు దయచూపాలి..



యానాంలో ఆధారాలు ఉన్నాయని ఇక్కడ ఏమీ సహాయం చేయడం లేదు.మా పిల్లలు అక్కడ ఉంటారు. మేం పాటు కోసం ఇక్కడ బతుకుతున్నాం. అక్కడ మాకు ఉపాధి లేదు. ఏన్నో ఏళ్లగా లంకల్లో ఉంటున్నా ప్రభుత్వ ఇళ్లకు నోచుకోలేదు. మాపై ప్రభుత్వం దయ చూపాలి.
- పెమ్మాడి రమణమ్మ, ఎదుర్లమ్మలంక

నా చిన్నప్పుడు అన్నారు..



మా కుటుంబంలో పది మంది వరకూ ఉన్నాం. నా చిన్నప్పుడు ప్రభుత్వం ఇల్లు ఇచ్చిందన్నారు. ఇప్పుడు నాకు 24 ఏళ్లు. ఆ మాటే గానీ మాకు ఇళ్లు ఇచ్చిన పరిస్థితి లేదు. మా తాతముత్తాతల నుంచీ ఈ లంకల్లోనే జీవిస్తున్నాం. అయినా మాకు ప్రభుత్వం ఇంటి సదుపాయం కల్పిం చలేదు. ప్రతి ఏడాదీ నరకం తప్పడం లేదు. - మల్లపు భవానీ దాస్, కేతావారిలంక

నేడే పింఛన్ల పండుగ

- ఇంటి వద్దనే అందజేత
- 102.54 కోట్లు పంపిణీ
- ఉద్యోగుల చెంతకు సొమ్ము
- 4200 మందికి బాధ్యత
- రెండు రోజులే గడువు
- తొలిరోజే లక్ష్యంపై దృష్టి
- 99 శాతం పంచేలా చర్యలు

రాజమహేంద్రవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నెలంతా ఎదురుచూసే పింఛన్ల పండుగ వచ్చేసింది.. నాలుగింతల ఆనందం తెచ్చేయనుంది. అధికారులు సిద్ధమైపోయారు.. మూడు రోజులు ముందుగానే డబ్బులు రావడంతో ముందుగానే తమ వద్ద ఉంచుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 5 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు ఇంటివద్దనే పంపిణీకి ఏర్పాటు చేశారు. వృద్ధులు, వితంతువులు తదితరులకు నెలకు రూ.4 వేల వంతున, దివ్యాంగులకు రూ.6 వేల వంతున మొత్తం 18 రకాల పింఛన్లు పంపిణీ చేయనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏప్రిల్ నుంచే పింఛన్ల సొమ్ము పెంపుదల చేసింది. అంతే కాకుండా ప్రతి లబ్ధిదారుడికి గత నెల 7 వేలు అందజేసింది. ఎన్నికల హామీలో భాగంగా రూ.3 వేల పింఛన్ రూ.4 వేలు చేయడంతో వృద్ధులకు సంతోషాన్ని ఇచ్చింది. దివ్యాంగుల పింఛన్ రూ.3 వేల నుంచి 6 వేలకు పెంచడంతో లబ్ధిదారుల్లో బతుకు మీద భరోసా ఏర్పడింది.వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఒకటి లేదా రెండు రోజుల్లో పింఛన్ పంపిణీ చేయడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు ఉండడంలేదు. టీడీపీ కూటమి గెలిస్తే పింఛన్లు ఇంటింటికీ పంపిణీ చేయరని గత వైసీపీ విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ఎన్నికల ముందు రెండు మూడు నెలలు తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన సంగతి తెలిసిందే. కూటమి గెలిసింది.సచివాలయ ఉద్యోగులకే పింఛన్ల పంపిణీ బాధ్యత ఇచ్చింది.ఈ మేరకు జూలై 1న సచివాలయ ఉద్యోగులు చాలెంజ్‌గా తీసుకుని ఒక్కరోజులోనే 90 శాతంపైగా పింఛన్లు పంపిణీ చేశారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులతో పంపిణీకి ఏర్పాట్లు చేసింది.

2,40,595 పింఛన్లు

జిల్లాలో మొత్తం 2,40,595మందికి రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 లబ్ధిని చేకూర్చ నున్నారు. పంపిణీకి 3900 మంది సచివాలయ ఉద్యోగులు, 300 మంది ఇతర ఉద్యోగులను ఎంపిక చేశారు. వారందరికీ బుధవారమే డబ్బు అప్పగిం చారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశారు. తొలిరోజు 99 శాతం పింఛన్లు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఏదైనా టెక్నికల్ సమస్య వస్తే మరుసటిరోజే అందిస్తారు. ఈ సారి రెండు రోజులే పింఛన్లు పంపిణీ చేస్తారు. ఆ తర్వాత గడువు పొడిగించే అవకాశం లేదని సమాచారం.ఈ నేపథ్యంలో పింఛన్‌దార్లను టాంటాం వంటి మార్గాల ద్వారా అప్రమత్తం చేశారు. అందరూ తొలి రోజే తీసుకునేలా ప్రచారం చేశారు.గత నెలలో మాదిరిగానే లబ్ధిదా రులకు ఎన్టీఆర్ పింఛన్ బట్వాడా రశీదు ఇస్తారు.



గోపాలపురంలో ఉద్యోగుల టాం..టాం

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి : సీఈవో

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, ఇతర సరుకులను బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరలకే రైతుబజార్లలో విక్రయించాలని రాష్ట్ర రైతు బజార్ల సీఈవో జి.శేఖర్‌బాబు అన్నారు. రాజమహేంద్రవరం క్వారీమార్కెట్ సెంటర్, వై జంక్షన్‌లోని ఆర్ట్స్ కళాశాల రైతు బజార్, మార్కెట్ కమిటీ ఆవరణలోని రైతుబజార్లను బుధవారం తనిఖీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు అమ్మకాలపై ఆరా తీశారు.ఆర్ట్స్ కళాశాల రైతు బజార్‌లో పలు సమస్యలు విన్నవించగా పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.సునీల్ వినయ్, రైతు బజార్ల అధికారులు రోజియా, శ్రీనివాస్ ఉన్నారు.



రైతు బజార్‌ను పరిశీలిస్తున్న సీఈవో శేఖర్‌బాబు

ఎస్‌ఎంసీల ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల

5న ఓటరుజాబితాపై అభ్యంతరాల స్వీకరణ..8న ఎన్నికలు

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం షెడ్యూల్ విడుదల చేస్తామని సర్వ శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సుభాషిని బుధవారం పేర్కొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికలకు గురువారం ఉదయం 10 గంటలకు షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు.అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు నోటీసు బోర్డుల్లో ఓటరు జాబి తా ప్రదర్శిస్తారని చెప్పారు. 5న ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకూ ఓటరు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం ఉంటుందన్నారు.ఖరారు చేసిన ఓటరు జాబితాను మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకూ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచుతారన్నారు. 8న ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకూ ఎన్నికల పోలింగ్, 1.30గంటలకు ఎన్నికైన కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు. 2గంటలకు ప్రమాన స్వీకారం అనంతరం 3గంటలకు నూతనంగా ఎన్నికైన కమిటీచే పాఠశాల నిర్వహణ సమావేశం జరుగుతుందని ఆమె తెలిపారు.

ధరల నియంత్రణకు కమిటీ : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : జిల్లాలో నిత్యావసర సరుకుల నియంత్రణకు జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని నియమించడం జరిగిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా ఆర్.కృష్ణనాయక్ (కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్), జిల్లా కన్వీనర్‌గా పి.విజయభాస్కర్ (డీసీఎస్‌వో), సభ్యులుగా ఎస్.మాధవరావు (జిల్లా వ్యవసాయాధికారి), ఎం.సునీల్ వినయ్ (జిల్లా మార్కెటింగ్ అధికారి), టి.రాధిక (డీసీఎస్‌ఎం), ఎల్.అప్పలకొండ (సీపీవో)ఏ.దుర్గేష్ (ఏపీఎంఐపీ), డి.ప్రతాప్ (డీఎం, మార్క్‌ఫెడ్), సుజాత (జిల్లా ఉద్యానవన అధికారి)లను నియమించినట్టు పేర్కొనారు. కమిటీ సభ్యులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో ధరల వివరాలను సేకరించి సమీక్ష నిర్వహించి నివేదికలు అందజేయాలని, ధరల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సిఫార్సు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



నేను రానేను బాబోయ్..
గోతిలో దిగి కూరుకుపోయిన బస్

ఏడీబీ రోడ్డుపై వెళితే..ఇంతే!

ఏడీబీ రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో చెప్పడానికి ఈ రెండు చిత్రాలే నిదర్శనం.. గోతుల్లో పడితే బయటకు రాలేవు.. అలాగని గోతుల్లో పడకుండా వెళ్లలేవు.. ఎందుకంటే రోడ్డే లేదు.. అంతా గోతులే.రంగంపేట మండలం వెంకన్నపేట వద్ద బుధవారం గోతిలో పడి ఒక లోడు లారీ బోల్తాపడగా.. ఆ తరువాత ఒక బస్ ఇలా రోడ్డు గోతిలో దిగి ఇలాగే ఉండిపోయింది. గత ఐదేళ్లూ వైసీపీ పాలనకు నిలువుటద్దం ఈ రోడ్డు..
- రంగంపేట

మూడు రోజుల కిందట పేపర్‌లోడ్‌తో వెళుతున్న లారీ తిరబడగా.. బుధవారం అదే ప్రాంతంలో బోల్తాపడిన ఇనుపగొట్టాల లోడు లారీ..





విజయ్‌పాల్ | అంబికా ప్రసాద్ | శ్రీనివాసమూర్తి | ఆదినారాయణ | కిశోర్‌కుమార్

నలుగురు డీఎస్పీలు బదిలీ

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా తూర్పు గోదావరిలో నలుగురికి స్థాన చలనం కలిగింది. వైసీపీ సేవలో తరించిన డీఎస్పీలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ స్థానంలో కృష్ణా జిల్లా డీపీటీసీలో పని చేస్తున్న కె.రమేశ్ బాబు వస్తున్నారు.దిశా డీఎస్పీ బి.ఆదినారాయణ స్థానంలో అనంతపురం పీటీసీ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావును నియమించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిషోర్ బాబును ఏసీబీకి బదిలీ చేశారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్, సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, దిశా డీఎస్పీ బి.ఆదినారాయణ, క్రైమ్స్ డీఎస్పీ కె.శ్రీనివాస మూర్తికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయా ల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం నలుగురు డీఎస్పీలు బదిలీ కాగా ఒకరికే పోస్టింగ్ దక్కింది. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ వైసీపీకి కొమ్ముకాశారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఎన్నికల సంఘానికి సైతం టీడీపీ ఫిర్యాదు చేసింది. మాజీ మంత్రి వేణు ఏరికోరి అంబికా ప్రసాద్‌ని జిల్లాకు తెచ్చుకున్నారనే విమర్శలున్నాయి.వేణు రాజమహేంద్రవరం రూరల్ శాసన సభ స్థానం నుంచి పోటీలో నిలిచిన విషయం తెలిసిందే. ఆ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పోలీస్ స్టేషన్లు సౌత్ జోన్‌లో ఉన్నాయి. దీంతో ఎన్నికల కోటాలో బదిలీలను అనుకూలంగా ఉపయోగించుకొని అంబికాప్రసాద్‌ని సౌత్ జోన్‌కి ఎన్నికల ముందు తీసుకొచ్చారు.దీని కోసం అప్పటికే అక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసులను తప్పించి నార్త్ జోన్‌కి పంపేశారు. దిశకు వస్తున్న కడలి వెంకటేశ్వరరావు గతంలో నార్త్‌జోన్ డీఎస్పీగా జిల్లాలో పనిచేశారు.

బొమ్మూరు డైట్‌లో అరాచకం

విద్యార్థినులను వేధిస్తున్న ఇద్దరు అధ్యాపకుల సస్పెన్షన్?

7



పోతవరం పీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇద్దరు వైద్యులకు షోకాజ్

నల్లజర్ల,జూలై 31 : పోతవరం పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ప్రశాంతి డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావుకు ఆదేశించారు. నల్లజర్ల మండలం పోతవరం పీహెచ్‌సీని కలెక్టర్ ప్రశాంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోతవరం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని.. అక్కడ సిబ్బందికి ఆశ వర్కర్లకు వివాదాలు, ఆసుపత్రికి వచ్చిన నిధులు గోల్‌మాల్ అయినట్టు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా వచ్చి పరిశీలించగా ఇద్దరు డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ రాజశేఖర్ సెలవు పెట్టగా.. మరో డాక్టర్ వెంకట్రావు ఆసుపత్రికి వచ్చి వెంటనే చీపురుగూడెం ఫీల్డ్‌కి వెళుతున్నట్టు చెప్పి వెళ్ళిపోయారు. కలెక్టర్ మూడు సార్లు డాక్టర్ వెంకట్రావును ఫోన్ చేయించగా స్పందించలేదు.చీపురుగూడెం నర్సుకు ఫోన్ చేయగా డాక్టర్ చీపురుగూడెం రాలేదని చెప్పడంతో కలెక్టర్ మండిపడ్డారు. కలెక్టర్ వస్తున్నారని తెలిసి మూమెంట్‌బుక్‌లో వైద్య సిబ్బందే చీపురుగూడెం ఫీల్డ్ అని వ్రాసి పెట్టినట్టు కలెక్టర్ గుర్తించారు.వెంటనే విచారణ చేసి తుది నివేదిక పంపించాలని తహశీ ల్దార్ కృష్ణారావుకు ఆదేశించారు. 24 గంటలు పనిచేయాల్సి ఉండగా కేవలం 6 గంటలే పనిచేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



ఫిల్టరేషన్ ముందు గోదావరి వాటర్..తరువాత రంగుమారిన వాటర్ చూపుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు చిత్రంలో అనుశ్రీ , తదితరులు

ప్రజలకు సురక్షిత నీరిస్తాం

నీరు శుద్ధి చేసే ప్రక్రియ పరిశీలనలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 31 : రాజమహేంద్రవరం ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడం కూటమి ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి బండ్ వద్దగల నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి విభాగాన్ని బుధవారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. గోదావరి రా వాటర్ శుద్ధి చేసే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా వాటిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగితే ముందుగా ప్రజలకు తెలియజేయాలని కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగరావు, ఈఈ ఎస్‌కే మదర్సా ఆలీ, డీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీధర్‌లకు సూచించారు. అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహి ంచినా దాని ప్రభావం కూటమి ప్రభుత్వం పైపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, కుడుపూడి సత్తిబాబు, యిన్నమూరి దీప, నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పునరావాస కల్పనే..

వరదలకు శాశ్వత పరిష్కారం

- పోలవరం గరిష్ఠ స్థాయిలో గోదావరి వరద ముంపు
- గతంలో చింతూరు ఐటీడీఏ పీవో నివేదికను పట్టించుకోని జగన్ ప్రభుత్వం

(రంపచోడవరం)



విలీన మండలాల్లో ముంపులో ఓ గ్రామం

గోదావరి పరీవాహక ప్రాంతంలోని గిరిజన ఆవాసాలను ముంచెత్తిన వరదలు గరిష్ఠ స్థాయిలో పోలవరం ప్రాజెక్టు కింద చోటుచేసుకునే స్థాయి ముంపును సృష్టించాయి. 2020 నుంచి ఈ పరిస్థితులు ఎదురవుతున్నా వరద ముంపును నిరోధించే శాశ్వత చర్యలు కొరవడుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదు మండలాల్లో పోలవరం ప్రాజెక్టు కింద 236 ఆవాసాలు ముంపునకు గురవుతుండగా 67,503 కుటుంబాల వారు నిర్వాసితులుగా ఉన్నారు. మొదటి దశలో 101 ఆవాసాలు ముంపునకు గురవుతున్నాయి. వీటిలో దేవీపట్నం మండలంలోని 46 ఆవాసాలు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ఇక నాలుగు విలీన మండలాల్లోని 190 ఆవాసాల్లో పునరావాసం అమలుకావాల్సి ఉంది. కాగా పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకుండానే వరదలు ఈ ఆవాసాలకు పోలవరం ప్రాజెక్టు ముంపు కష్టాల్ని రుచి చూపిస్తున్నాయి. 2020 నుంచి తాజా వరదల వరకు నాలుగు విలీన మండలాల్లో 134 ఆవాసాలు తరచూ ముంపును ఎదుర్కొంటున్నాయి. 1986నాటి తీవ్ర వరదలను లెక్కచేయని విలీన మండలాల గ్రామాలను పోలవరం కాఫర్‌డ్యామ్‌తో ముంపు తీవ్రత పెరిగి వరదలు కలవరపెడుతున్నాయి. గతంలో పోలవరం వద్ద 14 మీటర్ల స్థాయిలోనే గోదావరి ధవళేశ్వరం ఆనకట్టవైపు సులభంగా వెళ్లిపోయేది. ఇప్పుడు 40 మీటర్లు మించితేగానీ వెళ్లని పరిస్థితి కాఫర్ డ్యామ్, పోలవరం స్పిల్‌వే కారణంగా నెలకొంది. ఏ స్థాయిలో ఎన్ని క్యూసెక్కుల నీరు కిందకు వెళ్తుందో ఇంజనీర్లు ఇప్పటికే పేర్కొన్నారు. ఇటీవల పోలవరం కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం సుమారు 35 మీటర్ల వరకూ వెళ్లింది. ఈ స్థాయికి మించి 41.15 మీటర్ల స్థాయిలో మొదటి దశగా పోలవరం ప్రాజెక్టు కింద నీటిని నిల్వచేసినా విలీన మండలాల్లో 60 ఆవాసాలు మాత్రమే ప్రభావానికి లోను కావాల్సి ఉండగా వరదలు 134 ఆవాసాలను ముంచుతున్నాయి. ఇది ఏకంగా పోలవరం ముంపు లెక్కలనే తప్పుబట్టేలా ఉంది. 2019, 2020 వరదల్లో అసంపూర్ణంగా ఉన్న కాఫర్ డ్యామ్ కారణంగానే వరద తీవ్రత పోలవరం గరిష్ఠ స్థాయి... అంటే 45.72 మీటర్లలో మునిగే గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి 2021లో ప్రభుత్వానికి ఇచ్చిన ఒక నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. తరచుగా వచ్చే వరదల నుంచి విలీన మండలాల్లోని గ్రామాలను కాపాడాలంటే నిర్వాసితులకు పునరావాస కాలనీలను తక్షణం నిర్మించాలని పరోక్షంగా సూచించారు. ఈ ముంపు గ్రామాల కోసం 110 కాలనీలను పూర్తి చేయాల్సి ఉంది. అయితే గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం విలీన మండలాల కోసం ఒక్క కాలనీని పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తుందని విలీన మండలాల ప్రజలు ఆశిస్తున్నారు.

బొమ్మూరు డైట్ కళాశాలలో అరాచకం

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పీడీ విచారణ
- ఇద్దరు అధ్యాపకుల సస్పెండ్?
- ఇద్దరు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు
- అమరావతిలో రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు

రాజమహేంద్రవరంరూరల్/సిటీ, జూలై31: బొమ్మూరు డైట్ కళాశాలలో లైగింక వేధింపుల పట్ల విచారణ జరిపి ఇద్దరు అధ్యాపకులను సస్పెండ్ చేసినట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు సుమారు 15 రోజుల కిందట డీఎడ్ కోర్సు చదువుతున్న విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. కళాశాలలో ఇద్దరు అధ్యాపకులు, మరికొంతమంది నాన్‌టీచింగ్ స్టాఫ్ కలిసి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు విద్యార్థినులు ఫిర్యాదు పేర్కొన్నారు. ఈ విషయాన్ని డైట్ క్యాంపస్‌లోనే బయటపెట్టాలని ప్రయత్నించినా కొంతమంది నాన్‌టీచింగ్ స్టాఫ్ భయపెట్టడంతో వెనక్కి తగ్గినట్టు తెలిసింది. దీంతో విద్యార్థినులు ఎవరికి తెలియకుండా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం విచారణకు ఆదేశించారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి కళాశాలలో విచారణ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి జరిగిన వాస్తవాలు తెలుసుకున్నారు. కళాశాలలో జరిగిన చాలా విషయాలు బయటకు వచ్చాయి. లైంగిక వేధింపులతోపాటు భవన నిర్మాణాల్లో అక్రమాలు, దోపిడీ, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లో ఇద్దరు కింది స్థాయి ఉద్యోగుల అరాచకాలు, విద్యార్థినుల నుంచి అదనంగా ఫీజుల పేరుతో వసూళ్లు, మౌలిక సదుపాయాల లేమి వంటి అంశాలు బయటకు వచ్చాయి. ఆయా అంశాలపై విచారణ కొనసాగించారు. నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను విచారించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీకి ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులను ఆశ్రయించినట్టు విద్యార్థినులు తెలిపారు. కళాశాలలోని ఇద్దరు అటెండర్లు ప్రిన్సిపాల్‌నే బెదిరింపులకు గురిచేసిన సంఘటనలు జరిగినట్టు తెలిసింది. విచారణలో భాగంగా తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావుల తీరుపై విచారణ అధికారిణి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రిన్సిపాల్ జయశ్రీ ఈ ఏడాది ఏప్రిల్‌లో కళాశాలకు ప్రిన్సిపల్‌గా వచ్చారు. విద్యార్థినులపై లైగింక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో అమరావతిలో రిపోర్టు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిసింది. మరొక ఇద్దరు నాన్‌టీచింగ్ స్టాఫ్‌పై శాఖాపరమైన చర్యలకు ఆదేశాల్చినట్టు తెలిసింది. కళాశాలలో సరైన పర్యవేక్షణలేకపోవడం, భద్రత లేకపోవడం, అటెండర్లు నిబంధనలు పాటించకపోవడం విచారణ అధికారికి ఆశ్చర్యం కలిగించాయి. కళాశాలలో రూ.80 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనుల రికార్డులను తనిఖీ చేసి చేపట్టిన పనులు పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు.

రుణాల పేరుతో భారీగా సొమ్ములు స్వాహా

- వెలుగులోకి వస్తున్న యానిమేటర్ అక్రమాలు
- మరోమారు డీఆర్డీఏ అధికారుల విచారణ



పిఠాపురం మండలం బి.కొత్తూరులో విచారణ నిర్వహిస్తున్న డీఆర్డీఏ అధికారులు

పిఠాపురం రూరల్, జూలై 31: రుణాల పేరుతో యానిమేటర్ భారీగా సొమ్ములు స్వాహా చేసినట్టు వచ్చిన ఆరోపణలపై డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. మహిళా సంఘాల సభ్యుల పేరు మీద రూ.4 కోట్లు మేర రుణాలు తీసుకుని యానిమేటర్ పక్కదారి పట్టించినట్టు వెల్లడైంది. పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలోని మహిళా శక్తి సంఘాల సభ్యుల పేరుపై పిఠాపురానికి చెందిన యానిమేటర్ పద్మకుమారి రుణాలు తీసుకుని వాటిని చెల్లించకపోవడంతో ఏడు బ్యాంకుల నుంచి మహిళలకు నోటీసులు అందాయి. దీనిపై వారు తాము రుణాలు తీసుకోకుండా నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఇప్పటికే ఒకసారి విచారణ నిర్వహించిన అధికారులు బుధవారం మరోమారు విచారణ చేపట్టారు. డీఆర్డీఏ డీపీఎం వి.పద్మావతి, ఏపీఎం ప్రియదర్శిని, పిఠాపురం బ్యాంక్ ఆఫ్ బరోడా, డీసీసీబీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, ఐవోబీ, విరవాడ, పిఠాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అధికారులు 184 మంది మహిళలను విచారించారు. తాము ఒక్క రుణం మాత్రమే తీసుకున్నామని, మూడు, నాలుగు రుణాలు తీసుకోలేదని 40 మందికి పైగా మహిళలు చెప్పారు. యానిమేటర్ తీసుకున్న రుణాలు రూ.4కోట్లుపైగా ఉన్నాయని గుర్తించారు. యానిమేటర్ తమ పేరుపై ఎన్ని రుణాలు తీసుకుందో తెలియజేయాలని మహిళలు డిమాండ్ చేశారు. లెక్కలు తర్వాత చెప్తామంటూ అధికారులు వెళ్లిపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణలో ఎల్‌సీలు రమేష్, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.





రావులపాలెంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, కేవీ, ఆకుల.. విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం

అన్ని ఆలయాల అభివృద్ధికి కృషి

దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రావులపాలెం, జూలై 31: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధి ఏవిధంగా చేయాలన్న అంశంపై ముందుకు వెళ్తోంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు బాటలు వేస్తున్నారని' దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రావులపాలెంలోని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి స్వగృహానికి బుధవారం రాత్రి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, నాయకులు కేవీ, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్‌లు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆయనను సత్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధిపరిచేందుకు కృషిచేస్తామన్నారు. అర్చకులకు సరైన విధానం లేదు, వారు నిత్యపూజలు చేయడానికే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో 5400పైబడి దేవాలయాలకు దూపదీప నైవేద్యాలకు నగదు అందిస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రూ.10 వేలు ఇస్తామని ప్రకటించాం. దేవదాయశాఖపై రూ.32 కోట్లు అదనపు భారం పడుతునప్పటికీ ఇవ్వడానికే కట్టుబడి ఉన్నామన్నారు. రూ.50 వేలు ఉన్న దేవాలయాల్లో ఉన్న అర్చకులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు అందించడం జరుగుతుందన్నారు. ఆలయాలకు పాలకవర్గ సభ్యులను, అధి కారులను నియమించడం జరుగుతుందన్నారు. ఆలయాల ప్రక్షాళన మొదలుపెడతామన్నారు. టీటీడీలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఓ వ్యక్తి పరకామణిలో తొమ్మిది అమెరికన్ డాలర్లు దోచుకుంటే ఆ వ్యక్తిని పట్టుకుని కేసు పెట్టడం జరిగిందని, 72వేల విలువైన నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే ఆ వ్యక్తి పశ్చాత్తాపపడి రూ.14.50 కోట్లు టీటీడీ దేవస్థానానికి ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. దీన్నిబట్టి చూస్తే వైసీపీ పాలనలో ఎన్ని కోట్లు మేర దోపిడీ జరిగిందో తేటతెల్లమైందన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయినప్పటి నష్టం కన్నా వైసీపీ పాలన అధిక నష్టం రాష్ట్రానికి చేకూర్చిందన్నారు. దాదాపు 58 వ్యవస్థలు, డిపార్టుమెంట్లు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యం అయిపోయాయన్నారు. నాయకులు చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కొవ్వూరి జగన్నాధరెడ్డి, చిన్న కేవీ, వెలగల శ్రీనివాసరెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మైమరిచేలా..

ఏజెన్సీ అందాలను ఎంతసేపు చూసినా తనివితీరదు. మన్యం అంతటా కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కొంతసేపు పడి తెరిపిచ్చాక.. ఆ సమయంలో కొండల్లోంచి కనిపించే పొగమంచు అందాలు స్థానికులను, పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చింతూరు మండలం మోతుగూడెం సమీపంలోని సుకుమామిడి వద్ద బుధవారం ఇలా పొగమంచు అందాలు మైమరిపించాయి. **- మోతుగూడెం**



రాజమహేంద్రవరం మార్కెండేయస్వామి గుడి వద్ద టీటీడీ ఘాట్‌లో వరద ఉధృతి

నిలకడగా గోదారి

- 10.41 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం,జూలై31: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం తెల్లవారుజామున 4గంటలకు 12.10 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఆపై 1 5గంటలుగా నిలకడగా కొనసాగుతోంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10,41,489 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. రాత్రి 8 గంటలకు నీటిమట్టం నిలకడగా 12.10 అడుగుల వద్ద ఉంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం తగ్గకుండా నిలకడగా ఉంది. గురువారం ఉదయం వరకు నీటిమట్టం నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టవచ్చని ఆపై గంటల వ్యవధిలోనే మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గుతుందని అధికారులు అంచనా. కాగా ఎగువన భద్రాచలం వద్ద మంగళవారం అర్ధరాత్రి వరకు పెరిగిన నీటిమట్టం 45.10 అడుగుల వరకు చేరుకుని కొద్ది గంటలు నిలకడగా ఉండి ఆపై తగ్గుముఖం పడుతుంది. బుధవారం రాత్రి 8గంటలకు నీటి 44.70అడుగులుగా నమోదైంది. కాగా ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. బుధవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 9.85 మీటర్లుగా నీటిమట్టం నమోదుకాగా, పేరూరు వద్ద 15.48 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 12.17 మీటర్లు, భద్రాచలం వద్ద 44.70 అడుగులు, కూనవరం వద్ద 19.06మీటర్లు, కుంట వద్ద 10.37మీటర్లు, పోలవరం వద్ద 12.36 మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.12మీటర్లుగా నీటి మట్టం నమోదైంది.



సైకిల్‌తో సోకులేరు వాగు దాటుతున్న లక్కగూడెం గ్రామస్తుడు జోగయ్య

ప్రాణాలతో చెలగాటం

సోకులేరు వాగులో రాకపోకలు

మోతుగూడెం, జూలై 31: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ సోకులేరు వాగు పదిరోజులుగా కురుస్తున్న వర్షాలు పొంగి బుధవారం కాస్త తగ్గింది. దాంతో మిట్టవాడ, చొయులూరు, లక్కగూడెం, చదలవాడ గ్రామ ప్రజలు నిత్యావసర సరుకులు, వైద్యానికి సోకులేరు వాగు దాటారు. బుధవారం చింతూరు సంతకు వచ్చి అవసరమైన నిత్యావసర సరుకులను, ఆహార పదార్థాలను కొనుగోలు చేసుకుని తిరిగి సాయంత్రానికి తమ స్వగ్రామానికి వెళ్లారు. నిండుగా ప్రవహిస్తున్న ఏరులో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదం గుప్పెట్లో సాహసయాత్రలా ఉంటోంది. లక్కవరం గ్రామస్తుడు కలుముల జోగయ్య అనే వ్యక్తి చింతూరు సంతకు వెళ్లేందుకు సోకులేరు వాగులో ఏకంగా తన సైకిల్‌ను భుజంపై పెట్టుకుని వాగు దాటారు. ప్రతిసారి ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఏరు దాటుతున్నామని, అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలని వారంతా కోరుతున్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంటి వద్ద ఘర్షణ పడుతున్న యువకుడు

పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై దాడికి యత్నం

పెద్దాపురం, జూలై31: పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారుపై బుధవారం ఓ యువకుడు దాడికి యత్నించాడు. స్థానిక వరహాలయ్యపేటలో నివసిస్తున్న చైర్‌పర్సన్ కుటుంబానికి అదే ప్రాంతంలో నివసిస్తున్న యువకుడు తానారి సోమరాజు కుటుంబానికి కుటుంబ విషయాలకు సంబంధించి వివాదాలు జరుగుతున్నాయి. కౌన్సిల్ సమావేశం ముగించుకుని ఇంటికి వెళ్లిన చైర్‌పర్సన్ ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న సోమరాజు మద్యం సేవించి చైర్‌పర్సన్ ఇంటి వెళ్లి తలుపులు బద్దలు కొట్టేందుకు ప్రయత్నం చేశాడు. ఆమెను దుర్భాషలాడుతూ హంగామా సృష్టించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు వచ్చి యువకుడిని నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో ఆ యువకుడు దాడికి ప్రయత్నం చేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై వెలుగుల సురేష్ అక్కడికి చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డీనేటర్ దవులూరి దొరబాబు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు అక్కడకు చేరుకుని ఆమెకు అండగా నిలిచారు. చైర్‌పర్సన్‌పై దాడిని ఖండించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



ఏలేశ్వరం, జూలై 31: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో సి.రాయవరం గ్రామంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గజ్జి అప్పన్న (60) ఊట గుంటలో మృతిచెంది ఉండగా స్థానికులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

'ఎరువుల నియంత్రణ చట్టం సమర్థంగా అమలు'

రాజమహేంద్రవరంరూరల్, జూలై 31: కేంద్రప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా నకిలీ ఎరువులు, పురుగుమందులను నియంత్రించవచ్చని భారత ప్రభుత్వ రాష్ట్రీయ ఎరువుల నియంత్రణ ప్రయోగశాల ఉపసంచాలకులు అరుణ్ అన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజులపాటు 13 జిల్లాల మండల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అరుణ్ మాట్లాడుతూ మండలంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను నిత్యం పర్యవేక్షించి రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు కృష్ణదాసు, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు గంగాధర్ మాట్లాడారు.



ఏజెన్సీ వరద ప్రాంతాల పర్యటనలో కలెక్టర్ దినేష్, ఎమ్మెల్యే శిరీష

అన్నీ తానై..

- వరద సహాయ చర్యల్లో 10 రోజులపైగా చింతూరులోనే కలెక్టర్
- మండలానికో ఐఏఎస్ ద్వారా సేవలు నిరంతరం సేవలు
- వరద సాయంగా రూ.15.29 కోట్లతో ప్రతిపాదనలు
- ఒక్కరోజులోనే రూ.10 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

రంపచోడవరం/చింతూరు, జూలై31: ఒకటి రెండూ కాదు.. ఏకంగా పది రోజులకు పైగానే సాక్షాత్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ మూరుమూల ఏజెన్సీ మండలా ల్లో ఉండిపోయారు. గోదావరి వరద సహాయక కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని బాధితులకు బాసటగా నిలిచారు. ఆయనే అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్. గోదావరి పరీవాహక ప్రాంతంలోని నాలుగు విలీన మండలాల్లో వరద ముంచెత్తింది. రెండు వారాలపాటు వరద ముంపుతో ఏజెన్సీ ప్రజలు నానా కష్టాలుపడ్డారు. చింతూరులోనే కలెక్టర్ నివాసం ఉండి వరద సహాయక చర్యల్లో పదిరోజులకుపైగానే పాల్గొన్నారు. ఒకపక్క వరద సహాయ చర్యల్లో పాల్గొంటూనే పాడేరు కేంద్రంగా నిర్వర్తించాల్సిన కలెక్టరు విధులను చింతూరు నుంచే నిర్వర్తిస్తూ ప్రభుత్వాన్ని సంధానపర్చుతూ నిర్వాసితులకు భరోసా కల్పించారు. వరరామచంద్రపురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లోని 191 ఆవాసాల్లోని 35 వేలమంది వరదల ప్రభావానికి గురయ్యారు. ప్రతి మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని, ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టరు చొప్పున నాలుగు మండలాలకు నియమించారు. ప్రతి మండలంలో సాధ్యమైనంతవరకూ ప్రతి వరద ప్రభావిత గ్రామాన్నీ సందర్శించి, అక్కడి నిర్వాసితుల గోడు విన్నారు. ప్రతిరోజూ ప్రభుత్వానికి ఇక్కడి పరిస్థితులను నివేదించడం ద్వారా యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. సోమవారం ఆయన రూ.15.29 కోట్ల మేర నిధులు అవసరమని సమగ్ర నివేదిక పంపించడంతో ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులను జారీచేస్తూ తక్షణ సహాయంగా రూ.10 కోట్లను విడుదల చేసింది. నాలుగు మండలాల్లో వరద సహాయంపై నిర్వాసితుల్లో అసంతృప్తికి తావులేకుండా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఎక్కడికక్కడ ఆయా సమస్యల పరిష్కారం కోసం భరోసా కల్పించారు.



మిర్తిపాడు వేగుళ్ళమ్మ అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

అమ్మవారికి సారె సమర్పణ

సీతానగరం, జూలై 31: సీతానగరం మండలం, మిర్తిపాడు గ్రామంలోని గ్రామదేవత శ్రీ వేగుళ్ళమ్మ అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. ఆషాఢమాసం సందర్భంగా బుధవారం వేగుళ్ళమ్మ అమ్మవారికి సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలయ కమిటీ సహకారంతో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించి 101 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు.

లోకేశ్ ఓఎస్డీగా ఆకుల

గతంలో చింతూరు ఐటీడీఏ పీవో



చింతూరు, జూలై 31: వైఎస్ఆర్ జిల్లా బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్ల శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఓఎస్డీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆకుల వెంకటరమణ 2019 అక్టోబరు 10 నుంచి నుంచి 2022 జనవరి 29 వరకు చింతూరు ఐటీడీఏ పీవో కం ఆర్డీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత బద్వేలు ఆర్డీవోగా అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రకాశం జిల్లా మార్కాపురంనకు చెందిన ఆకుల తన తల్లిదండ్రులైన శ్రీరాములు, లక్ష్మీనరసమ్మల పేరిట మెమోరియల్ ట్రస్టు ప్రారంభించి యువతకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తూ వస్తున్నారు.

బాల దివ్యాంగులకు చేయూతనివ్వాలి : పీడీజే

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల హక్కులను పొందకుండా ఉన్న బాల దివ్యాంగులకు సంబంధిత శాఖలు చేయూత ఇవ్వాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. బాల దివ్యాంగుల హక్కుల పరిరక్షణపై వివిధ శాఖల ప్రభు త్వాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బాల దివ్యాంగులు విద్య, వైద్యం వంటి వాటికి దూరం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, 3వ, 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌లు రమ్య, పి.బాబు, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఫెలోల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రూసా నిధులతో నిర్వహించబడుతున్న పరిశోధనా ప్రాజెక్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భౌతికశాస్త్రం, భూ విజ్ఞానశాస్త్రం విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రాజెక్టు ఫెలోల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. అదేవిధంగా దరఖాస్తు నమూనా, మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో సందర్శించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏజెన్సీ సమాచారం



వరద తగ్గాక శబరి బ్రిడ్జి

తగ్గిన గోదావరి వరద

కూనవరం, జూలై31: కూనవరం, వీఆర్‌పురం రెండు మండలాల మధ్య శబరి బ్రిడ్జిపై యథావిధిగా రాకపోకలు జరుగుతున్నాయి. వరదల్లో శబరి బ్రిడ్జిపై పాములు, కలప వచ్చిచేరాయి. ఇప్పుడు వరదలు తగ్గడంతో వంతెనపై ఉన్న చెత్తాచెదారం కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు ఆ వంతెనపై యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నారు. కాగా వరద బాధితులకు మండలంలో శరవేగంగా ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేలను పంపిణీ చేశారు. తొలిరోజుగా రూ.2,18,52,000 పంపిణీ చేయడం జరిగింది. వాటితోపాటు 25 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు. మొత్తం 2,388 కుటుంబాలకు ఈ పంపిణీ జరిగింది. మిగతా పంపిణీ కార్యక్రమాన్ని గురువారం సైతం పంపిణీ చేపడతామని తహశీల్దార్ నాగరాజు తెలిపారు.

వరద బాధితులకు ఇంటింటికి రూ.3 వేలు పంపిణీ

చింతూరు, జూలై31 : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజను పరిదిలోని ముంపు బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి గాను రూ.3 వేలు వంతున ప్రభుత్వం ఆర్థిక సహకారం అందజేస్తోంది. డివిజను పరిధిలోని 191 గ్రామాలకు చెందిన 29,203 కుటుంబాలు వరద బారిన పడ్డాయి. ఆయా కుటుంబాలన్నింటికీ ప్రభుత్వం ఆర్థిక సహకారం, రేషను అందజేస్తోంది. బుధవారం పంపిణీ తీరును రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంతకుమార్ పర్యవేక్షించారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

రంపచోడవరం, జూలై 31: రైతు సేవా కేంద్రాల్లో పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అల్లూరి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సీహెచ్.నరసింహులు అన్నారు. బుధవారం ఆయన పెదగెద్దాడ పశువైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సహాయ సంచాలకులు ఎస్.సూర్యనారాయణ మూర్తి, పశువైద్యులు జి.రిక్కిరోయ్ తదితరులు పాల్గొన్నారు.

పశు యజమానులకు పశువుల దాణా పంపిణీ

ఎటపాక, జూలై31 : గోదావరి వరదలతో పశువులకు గ్రాసం దొరక్కపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం దాణాను పంపిణీ చేస్తోందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో పశువుల దాణాను పంపిణీ చేశారు. టీపీ వీడు గ్రామంలో సర్పంచ్ మోసం రాజులు ఆధ్వర్యంలో రైతులకు దాణాను పంపిణీ చేశారు. నెల్లిపాకలో పశుసంవర్ధశాఖ ఏడీ వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, ఏలారి వెంకన్న ఆధ్వర్యంలో దాణాను పంపిణీ చేశారు. కృష్ణవరం గ్రామంలో టీడీపీ నాయకులు దానే రాజు పశు యజమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కడియాల వెంకటేశ్వరరావు, బాచినేని మల్లేశ్వరరావు, దుద్దుకూరి సతీష్, వల్లభనేని విష్ణుమూర్తి పాల్గొన్నారు

అబ్బాలోము దంపతులకు సన్మానం

రంపచోడవరం, జూలై 31: వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందని బుధవారం పదవీ విరమణ పొందిన గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు కె.అబ్బాలోము అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అబ్బాలోము దంపతులను గిరిజన సంక్షేమశాఖ ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

రంపచోడవరం నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేగా ఎదిగిన మూలారెడ్డి

● నేడు ద్వితీయ వర్ధంతి.. పందలపాకలో విగ్రహావిష్కరణ

అనపర్తి, జులై 31: సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకు ఒంటరిగా ఎదిగిన ఎదురులేని నాయకుడు నల్లమిల్లి మూలారెడ్డి.. 52సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు.. పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడేవారు. 1942లో రామవరంలో సామాన్య రైతు కుటుంబంలో మూలారెడ్డి జన్మించారు. అంచలంచెలుగా ఎదిగిన ఆయన సర్పంచ్‌గా తన రాజకీయ జీవితానికి పునాది వేసుకున్నారు.టీడీపీ రాక ముందు పదేళ్లపాటు గ్రామ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. సమితి ఎన్నికల్లో రాజకీయ దిగ్గజం ఉండవల్లి సత్యనారాయణమూర్తి (రాయవరం మునసబు)తో ఢీకొని మంచి పేరు సంపాదించుకున్నారు. తరువాత క్రమంలో 1982లో అన్న ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో చేరి అనపర్తి నుంచి విజయాన్ని అందుకున్నారు. నాటి నుంచి 2009 వరకు జరిగిన ఏడు సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనపర్తి పూర్వపు నియోజకర్గమైన అనపర్తి, బిక్కవోలు, రాయవరం మండలాల్లో 27 హైస్కూళ్లను నిర్మించారు. అన్న ఎన్టీఆర్‌కు ఇష్టమైన ఎమ్మెల్యేల్లో మూలా రెడ్డి ఒకరు. మూలారెడ్డి ముక్కుసూటి వ్యవహారంతో ఎన్టీఆర్ మనసు దోచుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా మూలారెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగారు. అనపర్తి నియోజకవర్గాన్ని ఎన్నో విధాలా అభివృద్ధి చేసిన రాజకీయ దురంధరుడు అభిమానులను దుఃఖసాగరంలో ముంచి 2022 ఆగస్టు 1వ తేదీన దివికేగారు. మూలారెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బలభద్రపురం ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బిక్కవోలు మండలం పందలపాకలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. వర్ధంతి సభకు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు తదితరులు హాజరు కానున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మూలారెడ్డి

నేడు సీపీఐ జిల్లా సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం గురువారం రాజమహేంద్రవరంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు.ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాడితోట సంహిత ఫంక్షన్‌హాలులో ఉదయం11గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు.

బయోకార్ట్ ఇండియాతో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, బెంగళూరులోని బయో కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశోధనలు, తదితర అంశాలపై పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని వల్ల కళాశాలలోని బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ అధ్యాపకులు, విద్యార్థులకు జీవ సాంకేత శాస్త్రం, అణుజీవ శాస్త్రం, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగాలకు సంబంధించిన పరిశోధనలు చేయవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు.

నేడు ఎన్ఎంఈ లూథరన్ చర్చి వద్ద రిలేదీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 31 : ధవళేశ్వరంలోని ఎన్ఎంఈ లూథరన్ చర్చ్ పరిరక్షణ కమిటీ సభ్యులపై పెట్టిన బైండోవర్ కేసులు ఎత్తివేయడంతో పాటు నిధుల దుర్వినియోగం చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు ప్రమోద్ కుమార్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు గురువారం నుంచి రిలేదీక్షలు చర్చివద్దే చేపడుతున్నామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు దేవ ఏసావు, తొర్లపాటి విజయవర్ధన్, రవీంద్ర, నేతల డాన్ సైమన్, రవీంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

15,501 ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు

దివాన్‌చెరువు, జూలై31 : రాజానగరం మండలంలో 15,501 ఎన్టీఆర్ భరోసా పింఛన్లు గురువారం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు రాజానగరం ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ పింఛనుదారులకు రూ.6కోట్ల 50 లక్షలను అందజేస్తారని అన్నారు. దివాన్‌చెరువులో జరిగే పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొంటారని చెప్పారు.

నండూరి పార్థసారథికి ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 31: ముళ్లపూడి వెంకటరమణ తరువాత చెప్పుకోదగ్గ,మనసుకు కిత కితలుపెట్టే కవి నండూరి పార్థసారథి అని ప్రముఖ రచయిత, సాహితీ విమర్శకుడు కోడూరి శ్రీరామమూర్తి అన్నారు.స్థానిక దానవాయిపేటలోని బ్రౌన్ మందిరంలో బుధవారం నండూరి పార్థసారథి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాస్యం, సంస్కరణ దృష్టి కలిగిన రచనలు నండూరికి సొంతమని కితాబిచ్చారు. సన్ని ధానంశాస్త్రి, కవులు, రచయితలు పాల్గొన్నారు.

నూకాలమ్మకు సారె మహోత్సవం

బిక్కవోలు, జూలై 31: బిక్కవోలు గ్రామ దేవతగా పూజలందుకుంటున్న నూకాలమ్మ అమ్మవార్కి ఆషాడమాసం కృష్ణపక్షం బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం ఘనంగా సారె మహోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో 200 మంది మహిళలు 108 రకాల స్వీట్లు, పళ్లు, చీరలు, పసుపు, కుంకుమలతో గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతి అమ్మవార్కి, లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయంలోని లక్ష్మీదేవికి, మదుగులమ్మ తల్లికి, కాల్వ రేవులోని దుర్గమ్మ వద్ద వుంచి అనంతరం నూకాలమ్మకు సమర్పించారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రజాదర్బార్

● ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ,జూలై31: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రజా సమస్యల పరిష్కారానికి వినూత్నంగా ఆలోచించి జనవాణి ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన తొలి ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు అర్జీలతో పోటెత్తారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే ప్రతి అర్జీని స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్లు ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డు, పెన్షన్ వంటి సమస్యలు ఎక్కువగా వచ్చాయి. పంట దెబ్బతిన్న రైతులు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈప్రజా దర్బార్‌కు తరలివచ్చి అర్జీలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలనుంచిస్వీకరించిన అర్జీలు సకాలంలోపరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందర్, పలువురు ప్రజా ప్రతినిధులు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యం ఉండాలి : కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 31 : రాజమహేంద్రవరంలో మురుగు నీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చూడాలని శానిటేషన్ సిబ్బందిని కమిషనర్ కేతన్ గర్గ్ ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజీల్లోకి చెత్త వేయకుండా చూడాలన్నారు. స్వచ్ఛసర్వేక్షణలో మంచి ర్యాంక్ రాజమహేంద్రవరానికి రావాలని అందుకోసం నిరంతరం మెరుగైన పారిశుధ్యం ఉండాలన్నారు. ఈ పర్యటనలో కమిషనర్‌తో పాటు ఎమ్‌హెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

వ్యవసాయాన్ని పండుగలా చేయాలన్నదే ధ్యేయం

రంగంపేట, జూలై 31 : వ్యవసాయాన్ని పండుగలా చేయాలనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు సంబంధించి మరమ్మతులు, అవసరమైన నిధులు, పెండింగ్ బిల్లులు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం చాగల్నాడు, వెంకట్‌నగర్ ఎత్తిపోతల పథకాల ద్వారా ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణలు స్విచ్ ఆన్ చేసి సాగునీరు విడుదల చేశారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ల గోవింద్ మరియు తెలుగు దేశం, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.4 లక్షల విలువైన బంగారు లక్ష్మిరూపులు పంపిణీ

కోరుకొండ,జూలై31: విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన బంగారు వరలక్ష్మి కానుక 2 లక్కీడిప్ డ్రా బుధవారం కోరుకొండ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో అట్టహాసంగా జరిగింది. సుమారు 2వేల మంది మహిళామూర్తులు బంగారు లక్ష్మిరూపులు పంపిణీ కార్యక్రమంలో తమపేర్లు నమోదు చేసుకోగా లక్కీడిప్ డ్రాలో 48 మందిని విజేతలుగా ప్రకటించారు. వారిలో ఒకొక్కరికి రూ.7500లు విలువ చేసే ఒక గ్రాము బంగారు వరలక్ష్మి డాలర్‌ను కంబాల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఉచితంగా అందజేశారు.

బీఎడ్ ప్రవేశాల కమిటీ సభ్యుడిగా సుబ్బారావు నియామకం

దివాన్‌చెరువు, జూలై31 : బీఎడ్ ప్రవేశాల నిర్వహణ కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమించిన కమిటీలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కొండ్రు సుబ్బారావును నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల నుంచి ఇద్దరు సభ్యులను నియమించగా అందులో సుబ్బారావు ఒకరు. ప్రిన్సిపాల్ సుబ్బారావును నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్ తదితరులు అభినందించారు.

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

సీతానగరం జూలై 31: సీతానగరం మండలం, రాపాక గ్రామానికి చెందిన కోమలి శంకరానికి సారా కేసులో కోసులో రిమాండ్ విధించినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాపాక గ్రామ శివారున సారా అమ్ముతుండగా దాడి చేసి శంకరంను అరెస్టు చేసి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఆయన తెలిపారు

పశువులకు దాణా పంపిణీ

కడియం, జూలై 31: ఇటీవల గోదావరి వరదల వలన కడియం మండలం పరిధిలో ముంపునకు గురైన ప్రాంతాల్లో పాడిరైతులకు బుధవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువుల దాణా పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల పరిధిలో వేమగిరి, కడియపులంక, పొట్టిలంక గ్రామాలకు చెందిన లంక పొలా ల్లో వరద ముంపుతో పశువుల మేత, నీటి ఇబ్బందులు పడుతున్న పశుపోషకుల జాబితాను పశుసంవర్ధకశాఖ సేకరించారు.



నిండుగా ప్రవహిస్తున్న గోదావరి

తగ్గిన గోదావరి

భద్రాచలం, ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న ఫస్ట్‌వార్నింగ్

- వివరాలు 8లో

రాజమహేంద్రవరం, జూలై31 (ఆంధ్రజ్యోతి) : గోదావరి వరద దోబూచులాడుతోంది. అప్పుడే తగ్గుతోంది.. అప్పుడే పెరుగుతోంది.. సుమారు రెండు వారాలుగా గోదావరి వరద కొనసాగుతూనే ఉంది. వరద ముంపు బాధితులు సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. పోలవరం స్పిల్‌వే నుంచి 9,53,451 క్యూసెక్కుల నీరు రాజమహేంద్రవరం అఖండ గోదావరి మీదుగా బ్యారేజీ వద్దకు వస్తోంది. అక్కడ నుంచి బ్యారేజీ గుండా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలను ముంచుతూ సముద్రంలోకి వెళుతుంది. గోదావరి వరద ఏజెన్సీ గ్రామాలు, కోనసీమలోనే ఎక్కువ నష్టం మిగిల్చింది. అంతే కాకుండా గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భద్రాచలం వద్ద ఉదయం 8 గంటలకు నీటిమట్టం 45 అడుగులకు పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు 45.10 అడుగులకు నెమ్మదిగా చేరి మధ్యాహ్నం 3 గంటలకు కాస్త తగ్గింది. 6 గంటలకు 44.90 అడుగులకు చేరింది. రాత్రి 11 గంటలకు 44.60 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.నీటిమట్టం 43 అడుగులకంటే తగ్గితే హెచ్చరికను ఉపసంహరించుకుంటారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ నీటిమట్టం 12.10 అడుగులు వద్ద నిలకడగా ఉంది. బ్యారేజీ నుంచి ఉదయం 5 గంటలకు 10,60,023 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు.రాత్రి 11 గంటలకు 10,41,489 క్యూసెక్కులు సముద్రంలోకి వెళుతోంది. దిగువకు వెళ్లే నీరు 10 లక్షలకు దిగినా, నీటిమట్టం 11.75 అడుగుల కంటే తగ్గినా మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకుంటారు.ఇక్క ట్రెండ్ తగ్గుముఖంగా ఉందని అధికార రిపోర్టులు చెబుతున్నాయి. ఇక ప్రవాహం ఉధృతంగానే ఉంది. అయితే లంకలన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. వరద ఉధృతి తగ్గితే లంకల్లో నీరు లాగుతోంది.

గోదారి.. బతుకులు!



దశాబ్దాలు గడచిపోతున్నాయి.. అయితేనేం వరదొస్తే నిల్చోవడానికి నిలువ నీడ లేదు.. కూర్చుందామంటే జాగాలేదు.. పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తేనే అక్కడే సేదతీరతారు.. వరద రెండు నెలలూ ఆ కేంద్రంలోనే కాలం గడిపేస్తారు.. మళ్లీ వరద తగ్గిందంటే మామూలే.. మళ్లీ లంకలకు వెళ్లిపోతున్నారు.. మళ్లీ వరదొచ్చే వరకూ గోదారమ్మ ఒడిలో చల్లగా సేదతీరతారు.. వరదొచ్చిందంటే ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాల బాటపడతారు.. ఇదీ 30 ఏళ్లకు పైనుంచి గోదావరి లంకల్లో నివాసం ఉండే మత్స్యకారుల పరిస్థితి.. వీళ్ల గురించి పట్టించుకున్న పాలకులు లేరు.. అధికారులు లేరు.. వరద ముంపు కారణంగా ప్రస్తుతం పునరావాస కేంద్రంలో ఉన్న మత్స్యకారులను పలకరించగా.. గోదావరిని విడిచి ఉండలేం.. వదిలిరాలేం.. కానీ గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇళ్లిస్తే గోదారిని చూసుకుంటూ బతికేస్తామని చెబుతున్నారు..

- » గోదారి వదల్లేరు.. బయటకు రాలేరు...
- » వరదొస్తే.. మత్స్యకారుల జీవనం దుర్భరం
- » రెండు నెలలు తప్పని పునరావాసం
- » ప్రతి ఏడాది ఇంతే.. అయినా లంకావాసం
- » ఇళ్లిస్తే బయటకు వస్తామంటున్న మత్స్యకారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రెక్కలకు చుక్కానీ తోడైతే గానీ డొక్కాడని జీవితాలు. వేటకెళ్తేనే పూట సాగేది.ఈ సుడిగుండాల జీవనయానంలో వరదల వేళ మరీ నరకం. గోదారమ్మ ఒడిలో గందరగోళ జీవనం. నెలల తరబడి లంకావాసం.. గోదారమ్మ ఉగ్రమైన రోజుల్లో ఏడాదికోమారు నగరంలో పునరావాసం. వరద తగ్గిన తర్వాత తిరిగి ఇళ్లకు వెళ్లే సరికి మిగిలేది బురద.. రగిలేది ఆవేదన. ఇదీ లంకల్లోని మత్స్యకార జీవితాల విదారక కథా చిత్రమ్.

నెలల తరబడి లంకావాసం..

జిల్లావ్యాప్తంగా లంక ప్రాంతాలు చాలా ఉంటాయి. అయితే వీటిలో కొన్ని లంకల్లో మాత్రమే మత్స్యకారులు జీవన సాగిస్తుంటారు.. వీళ్లు వర్షాకాలం, వరదల వేళ నరకం అనుభవిస్తు న్నారు. పాలకులు ఎంత మంది మారినా వారి బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు.గోదావరి మధ్యలో జాలర్లు తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే నివాసం ఉంటారు. ప్రస్తుతం ఎదుర్లమ్మలంక, కేతావారిలంక, బ్రిడ్జిలంక తదితర మరో రెండు లంకల్లో కలిపి వెయ్యి మంది వరకూ మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 30 ఏళ్లకు పైబడి నివసించేవారు చాలా మంది ఉన్నారు. ఆయా నివాసాల్లో దంపతులిద్దరూ వేటకు వెళితేనే కానీ పూటగడవదు.గోదావరికి వరదొస్తే మాత్రం నరకం చూస్తుంటారు.వరదొచ్చే రెండు నెలలూ తలదాచుకునేందుకు నీడ ఉండదు. కడుపు నింపుకునేందుకు వేట ఉండదు. పునరావాస కేంద్రాలే దిక్కు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవు తారు. ఇళ్లలోని సామ గ్రిని పడవల్లో ఉంచి టార్పాలిన్లు కడతారు. గోదావరి శాంతించిన తర్వాత ఇళ్లకు వెళతారు. ప్రతి ఏడాది జరిగే తంతే అయినా వీళ్లు మారరు.. లంకలను వదిలి నగరంలోకి రారు.

ఏడాదికోమారు ఇలా ..

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం పునరావాసం కల్పించి తోడుగా నిలిచింది.గతేడాది వైసీపీ ప్రభుత్వంలో ధవళేశ్వరం వద్ద బ్యారేజీ వరద 28 అడుగులకు చేరింది.. అయినా పట్టించు కోలేదు. వరద పోటుకు భయపడి పడవల్లోనే రోజులు గడిపేవారు. ఉధృతి మరీ ఎక్కువైన సమ యంలో తమంతట తాముగా ఈ దరికి వచ్చి అధికారులను వేడుకుంటే దయతలచేవాళ్లు. పునరావాసం కల్పించినా అరకొరగానే సదుపాయాలు ఉండేవి. ఈ ఏడాది వరద లంక గట్లను తాకగానే ఉన్నతాధికారులు సైతం లంకల్లోకి పరు గులు పెట్టారు. పడవల్లో జాగ్రత్తగా మత్స్యకా రులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అల్కట్‌తోట మునిసిపల్ కల్యాణ మండపంలో 248 మంది, చందా సత్రంలో 198 మందికి యుద్ధ ప్రాతిపదికన కలెక్టర్ పునరావాస ఏర్పాట్లు చేయిం చారు. జిల్లా వ్యాప్తంగా 1421 కుటుంబాలకు పున రావాస పరిహారం కింద నిత్యావసర సరుకులతో పాటు 529 కుటుంబాలకు రూ.3 వేల చొప్పున అందించింది. వరద తగ్గే వరకూ పునరావాస శిబి రాలు కొనసాగిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేయడం మత్స్యకారుల్లో మనోధైర్యాన్ని నింపింది.

గూడు కల్పిస్తే..

లంకల్లో మత్స్యకారులకు వేట ఒకటే జీవనాధారం. రోజూ వేట సాగించి వాటిని అమ్ముకొని జీవితాలు సాగిస్తారు. వరదల వేళ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పడవలు ఒడ్డుకు చేరక తప్పదు.దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రతి ఏడాదీ ఈ నరకం తప్పడం లేదని.. నగర పరిధిలో గోదావరి సమీపంలో తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తే చాలా వరకూ ఇబ్బందులు తప్పుతాయని మత్స్యకారులు చెబుతున్నారు.ఎందుకంటే ప్రభుత్వాలు పునరావాసం కల్పిస్తున్నా నరకం తప్పదు. లంకల్లోని ఇళ్ల వద్ద ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లను వరదల వేళ వదిలి వేస్తుంటారు. దీంతో రోజూ ఉగ్ర గోదావరిపై పడవలో వెళ్లి మూగజీవాలను గమనించుకుంటూ ఉంటారు. ప్రతి ఏడాది చాలా పశువులు గోదారికి బలైపోతుంటాయి. పడవలకు ఒడ్డున లంగరు వేస్తారు. ఈదురుగాలులు, వరద ఉధృతికి మోకులు లూజు కావడం, లంగరు పైకి రావడం జరుగుతుంది. ఆ పరిస్థితుల్లో పడవలు గల్లంతైపోతాయి. ఒక్కో ఇంజను బోటు ఖరీదు సుమారు రూ.3 లక్షలు. మహిళలు పునరావాస కేంద్రంలో తలదాచుకోగా.. మగవారు పడవలకు కాపలాగా ఉంటారు. వీళ్లకు భోజనాలకు ఇబ్బంది అయినా ఒక్కో పూట తిండి లేకపోయినా పడవలే జీవనాధారం కాబట్టి వాటి వద్దే కనిపెట్టుకొని ఉంటారు. అందువల్ల దాతలు కూడా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

30 ఏళ్లుగా లంకలోనే



మాది బ్రిడ్జి పేట.. 30 ఏళ్లగా అక్కడే ఉంటున్నాం. లంకల్లో చాలా సదుపాయాలు సొంతగా ఏర్పాటు చేసుకున్నాం. వరదలు వచ్చినప్పుడు నరకం చూస్తున్నాం. పైనుంచీ ఈ బాధ అనుభవిస్తున్నాం. గోదావరి లాగిన తర్వాత ఇంటికి వెళితే బురద శుభ్రం చేసుకోడానికి నెల పడుతుంది. మాకు ఇంటి సదుపాయం కల్పిస్తే ఊళ్లోకి వచ్చేస్తాం. - **కర్రి నూకరత్నం, బ్రిడ్జిలంక**

బ్రిడ్జి నిర్మాణంలో పని చేశా..



ఆర్చి బ్రిడ్జి నిర్మాణంలో పని చేశా. అప్పట్లో రూ.50 కూలీ ఇచ్చేవారు. అంతకు ముందు నుంచే లంకల్లో బతుకుతున్నాం. రాత్రివేళల్లో భయంగా ఉంటుంది. వరద లాగిన తర్వాత విష ప్రాణులతో ప్రమాదకరంగా ఉంటుంది. ఇళ్లకు వెళ్లే సరిగి గోడలకు, చెట్లకు పాములు వేలాడుతూ ఉంటాయి. **కర్రి దుర్గయ్య, బ్రిడ్జిలంక**

పాలకులు దయచూపాలి..



యానాంలో ఆధారాలు ఉన్నాయని ఇక్కడ ఏమీ సహాయం చేయడం లేదు.మా పిల్లలు అక్కడ ఉంటారు. మేం పొటు కోసం ఇక్కడ బతుకుతున్నాం. అక్కడ మాకు ఉపాధి లేదు. ఏన్నో ఏళ్లగా లంకల్లో ఉంటున్నా ప్రభుత్వ ఇళ్లకు నోచుకోలేదు. మాపై ప్రభుత్వం దయ చూపాలి. **- పెమ్మాడి రమణమ్మ, ఎదుర్లమ్మలంక**

నా చిన్నప్పుడు అన్నారు..



మా కుటుంబంలో పది మంది వరకూ ఉన్నాం. నా చిన్నప్పుడు ప్రభుత్వం ఇల్లు ఇచ్చిందన్నారు. ఇప్పుడు నాకు 24 ఏళ్లు. ఆ మాటే గానీ మాకు ఇళ్లు ఇచ్చిన పరిస్థితి లేదు. మా తాతముత్తాతల నుంచీ ఈ లంకల్లోనే జీవిస్తున్నాం. అయినా మాకు ప్రభుత్వం ఇంటి సదుపాయం కల్పిం చలేదు. ప్రతి ఏడాదీ నరకం తప్పడం లేదు. **- మల్లపు భవానీ దాస్, కేతావారిలంక**

నేడే పింఛన్ల పండుగ

- » ఇంటి వద్దనే అందజేత
- » 102.54 కోట్లు పంపిణీ
- » ఉద్యోగుల చెంతకు సొమ్ము
- » 4200 మందికి బాధ్యత
- » రెండు రోజులే గడువు
- » తొలిరోజే లక్ష్యంపై దృష్టి
- » 99 శాతం పంచేలా చర్యలు

రాజమహేంద్రవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నెలంతా ఎదురుచూసే పింఛన్ల పండుగ వచ్చేసింది.. నాలుగింతల ఆనందం తెచ్చేయనుంది. అధికారులు సిద్ధమైపోయారు.. మూడు రోజులు ముందుగానే డబ్బులు రావడంతో ముందుగానే తమ వద్ద ఉంచుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 5 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు ఇంటివద్దనే పంపిణీకి ఏర్పాటు చేశారు. వృద్ధులు, వితంతువులు తదితరులకు నెలకు రూ.4 వేల వంతున, దివ్యాంగులకు రూ.6 వేల వంతున మొత్తం 18 రకాల పింఛన్లు పంపిణీ చేయనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏప్రిల్ నుంచే పింఛన్ల సొమ్ము పెంపుదల చేసింది. అంతే కాకుండా ప్రతి లబ్ధిదారుడికి గత నెల 7 వేలు అందజేసింది. ఎన్నికల హామీలో భాగంగా రూ.3 వేల పింఛన్ రూ.4 వేలు చేయడంతో వృద్ధులకు సంతోషాన్ని ఇచ్చింది. దివ్యాంగుల పింఛన్ రూ.3 వేల నుంచి 6 వేలకు పెంచడంతో లబ్ధిదారుల్లో బతుకు మీద భరోసా ఏర్పడింది.వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఒకటి లేదా రెండు రోజుల్లో పింఛన్ పంపిణీ చేయడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు ఉండడంలేదు. టీడీపీ కూటమి గెలిస్తే పింఛన్లు ఇంటింటికి పంపిణీ చేయరని గత వైసీపీ విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ఎన్నికల ముందు రెండు మూడు నెలలు తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన సంగతి తెలిసిందే. కూటమి గెలిసింది.సచివాలయ ఉద్యోగులకే పింఛన్ల పంపిణీ బాధ్యత ఇచ్చింది.ఈ మేరకు జూలై 1న సచివాలయ ఉద్యోగులు చాలెంజ్‌గా తీసుకుని ఒక్కరోజులోనే 90 శాతంపైగా పింఛన్లు పంపిణీ చేశారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులతో పంపిణీకి ఏర్పాట్లు చేసింది.

2,40,595 పింఛన్లు

జిల్లాలో మొత్తం 2,40,595మందికి రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 లబ్ధిని చేకూర్చ నున్నారు. పంపిణీకి 3900 మంది సచివాలయ ఉద్యోగులు, 300 మంది ఇతర ఉద్యోగులను ఎంపిక చేశారు. వారందరికీ బుధవారమే డబ్బు అప్పగిం చారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశారు. తొలిరోజు 99 శాతం పింఛన్లు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఏదైనా టెక్నికల్ సమస్య వస్తే మరుసటిరోజే అందిస్తారు. ఈ సారి రెండు రోజులే పింఛన్లు పంపిణీ చేస్తారు. ఆ తర్వాత గడువు పొడిగించే అవకాశం లేదని సమాచారం.ఈ నేపథ్యంలో పింఛన్‌దార్లను టాంటాం వంటి మార్గాల ద్వారా అప్రమత్తం చేశారు. అందరూ తొలి రోజే తీసుకునేలా ప్రచారం చేశారు.గత నెలలో మాదిరిగానే లబ్ధిదారులకు ఎన్టీఆర్ పింఛన్ బట్వాడా రశీదు ఇస్తారు.



గోపాలపురంలో ఉద్యోగుల టాం..టాం

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి : సీఈవో

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, ఇతర సరుకులను బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరలకే రైతుబజార్లలో విక్రయించాలని రాష్ట్ర రైతు బజార్ల సీఈవో జి.శేఖర్‌బాబు అన్నారు. రాజమహేంద్రవరం క్వారీమార్కెట్ సెంటర్, వై జంక్షన్‌లోని ఆర్ట్స్ కళాశాల రైతు బజార్, మార్కెట్ కమిటీ ఆవరణలోని రైతుబజార్లను బుధవారం తనిఖీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు అమ్మకాలపై ఆరా తీశారు.ఆర్ట్స్ కళాశాల రైతు బజార్‌లో పలు సమస్యలు విన్నవించగా పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.సునీల్ వినయ్, రైతు బజార్ల అధికారులు రోజియా, శ్రీనివాస్ ఉన్నారు.



రైతు బజార్‌ను పరిశీలిస్తున్న సీఈవో శేఖర్‌బాబు

ఎస్‌ఎంసీల ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల

5న ఓటరుజాబితాపై అభ్యంతరాల స్వీకరణ..8న ఎన్నికలు

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం షెడ్యూల్ విడుదల చేస్తామని సర్వ శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సుభాషిని బుధవారం పేర్కొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికలకు గురువారం ఉదయం 10 గంటలకు షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు.అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు నోటీసు బోర్డుల్లో ఓటరు జాబి తా ప్రదర్శిస్తారని చెప్పారు. 5న ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకూ ఓటరు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం ఉంటుందన్నారు.ఖరారు చేసిన ఓటరు జాబితాను మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకూ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచుతారన్నారు. 8న ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకూ ఎన్నికల పోలింగ్, 1.30గంటలకు ఎన్నికైన కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు. 2గంటలకు ప్రమాన స్వీకారం అనంతరం 3గంటలకు నూతనంగా ఎన్నికైన కమిటీచే పాఠశాల నిర్వహణ సమావేశం జరుగుతుందని ఆమె తెలిపారు.

ధరల నియంత్రణకు కమిటీ : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : జిల్లాలో నిత్యావసర సరుకుల నియంత్రణకు జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని నియమించడం జరిగిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా ఆర్.కృష్ణనాయక్ (కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్), జిల్లా కన్వీనర్‌గా పి.విజయభాస్కర్ (డీసీఎస్‌వో), సభ్యులుగా ఎస్.మాధవరావు (జిల్లా వ్యవసాయాధికారి), ఎం.సునీల్ వినయ్ (జిల్లా మార్కెటింగ్ అధికారి), టి.రాధిక (డీసీఎస్‌ఎం), ఎల్.అప్పలకొండ (సీపీవో),ఏ.దుర్గేష్ (ఏపీఎంఐపీ), డి.ప్రతాప్ (డీఎం, మార్క్‌ఫెడ్), సుజాత (జిల్లా ఉద్యానవన అధికారి)లను నియమించినట్టు పేర్కొనారు. కమిటీ సభ్యులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో ధరల వివరాలను సేకరించి సమీక్ష నిర్వహించి నివేదికలు అందజేయాలని, ధరల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సిఫార్సు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



నేను రానేను బాబోయ్.. గోతిలో దిగి కూరుకుపోయిన బస్

ఏడీబీ రోడ్డుపై వెళితే..ఇంతే!

మూడు రోజుల కిందట పేపర్‌లోడ్‌తో వెళుతున్న లారీ తిరబడగా.. బుధవారం అదే ప్రాంతంలో బోల్తాపడిన ఇనుపగొట్టాల లోడు లారీ..



ఏడీబీ రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో చెప్పడానికి ఈ రెండు చిత్రాలే నిదర్శనం.. గోతుల్లో పడితే బయటకు రాలేవు.. అలాగని గోతుల్లో పడకుండా వెళ్లలేవు.. ఎందుకంటే రోడ్డే లేదు.. అంతా గోతులే.రంగంపేట మండలం వెంకన్నపేట వద్ద బుధవారం గోతిలో పడి ఒక లోడు లారీ బోల్తాపడగా.. ఆ తరువాత ఒక బస్ ఇలా రోడ్డు గోతిలో దిగి ఇలాగే ఉండిపోయింది. గత ఐదేళ్లూ వైసీపీ పాలనకు నిలువుటద్దం ఈ రోడ్డు..
- రంగంపేట



విజయ్‌పాల్ | అంబికా ప్రసాద్ | శ్రీనివాసమూర్తి | ఆదినారాయణ | కిశోర్‌కుమార్

నలుగురు డీఎస్పీలు బదిలీ

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా తూర్పు గోదావరిలో నలుగురికి స్థాన చలనం కలిగింది. వైసీపీ సేవలో తరించిన డీఎస్పీలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ స్థానంలో కృష్ణా జిల్లా డీపీటీసీలో పని చేస్తున్న కె.రమేశ్ బాబు వస్తున్నారు.దిశా డీఎస్పీ బి.ఆదినారాయణ స్థానంలో అనంతపురం పీటీసీ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావును నియమించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిషోర్ బాబును ఏసీబీకి బదిలీ చేశారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్, సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, దిశా డీఎస్పీ బి.ఆదినారాయణ, క్రైమ్స్ డీఎస్పీ కె.శ్రీనివాస మూర్తికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయా ల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం నలుగురు డీఎస్పీలు బదిలీ కాగా ఒకరికే పోస్టింగ్ దక్కింది. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.విజయపాల్ వైసీపీకి కొమ్ముకాశారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఎన్నికల సంఘానికి సైతం టీడీపీ ఫిర్యాదు చేసింది. మాజీ మంత్రి వేణు ఏరికోరి అంబికాప్రసాద్‌ని జిల్లాకు తెచ్చుకున్నారనే విమర్శలున్నాయి.వేణు రాజమహేంద్రవరం రూరల్ శాసన సభ స్థానం నుంచి పోటీలో నిలిచిన విషయం తెలిసిందే. ఆ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పోలీస్ స్టేషన్లు సౌత్ జోన్‌లో ఉన్నాయి. దీంతో ఎన్నికల కోటాలో బదిలీలను అనుకూలంగా ఉపయోగించుకొని అంబికాప్రసాద్‌ని సౌత్ జోన్‌కి ఎన్నికల ముందు తీసుకొచ్చారు.దీని కోసం అప్పటికే అక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసులను తప్పించి నార్త్ జోన్‌కి పంపేశారు. దిశకు వస్తున్న కడలి వెంకటేశ్వరరావు గతంలో నార్త్‌జోన్ డీఎస్పీగా జిల్లాలో పనిచేశారు.

బొమ్మూరు డైట్‌లో అరాచకం

విద్యార్థినులను వేధిస్తున్న ఇద్దరు అధ్యాపకుల సస్పెన్షన్? 8



పోతవరం పీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇద్దరు వైద్యులకు షోకాజ్

నల్లజర్ల,జూలై 31 : పోతవరం పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ప్రశాంతి డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావుకు ఆదేశించారు. నల్లజర్ల మండలం పోతవరం పీహెచ్‌సీని కలెక్టర్ ప్రశాంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోతవరం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని.. అక్కడ సిబ్బందికి ఆశ వర్కర్లకు వివాదాలు, ఆసుపత్రికి వచ్చిన నిధులు గోల్‌మాల్ అయినట్టు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా వచ్చి పరిశీలించగా ఇద్దరు డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ రాజశేఖర్ సెలవు పెట్టగా.. మరో డాక్టర్ వెంకట్రావు ఆసుపత్రికి వచ్చి వెంటనే చీపురుగూడెం ఫీల్డ్‌కి వెళుతున్నట్టు చెప్పి వెళ్ళిపోయారు. కలెక్టర్ మూడు సార్లు డాక్టర్ వెంకట్రావును ఫోన్ చేయించగా స్పందించలేదు.చీపురుగూడెం నర్సుకు ఫోన్ చేయగా డాక్టర్ చీపురుగూడెం రాలేదని చెప్పడంతో కలెక్టర్ మండిపడ్డారు. కలెక్టర్ వస్తున్నారని తెలిసి మూమెంట్‌బుక్‌లో వైద్య సిబ్బందే చీపురుగూడెం ఫీల్డ్ అని వ్రాసి పెట్టినట్టు కలెక్టర్ గుర్తించారు.వెంటనే విచారణ చేసి తుది నివేదిక పంపించాలని తహశీ ల్దార్ కృష్ణారావుకు ఆదేశించారు. 24 గంటలు పనిచేయాల్సి ఉండగా కేవలం 6 గంటలే పనిచేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



ఫిల్టరేషన్ ముందు గోదావరి వాటర్..తరువాత రంగుమారిన వాటర్ చూపుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు చిత్రంలో అనుశ్రీ , తదితరులు

ప్రజలకు సురక్షిత నీరిస్తాం

నీరు శుద్ధి చేసే ప్రక్రియ పరిశీలనలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 31 : రాజమహేంద్రవరం ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడం కూటమి ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి బండ్ వద్దగల నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి విభాగాన్ని బుధవారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. గోదావరి రా వాటర్ శుద్ధి చేసే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా వాటిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగితే ముందుగా ప్రజలకు తెలియజేయాలని కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగరావు, ఈఈ ఎస్‌కే మదర్సా ఆలీ, డీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీధర్‌లకు సూచించారు. అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహి ంచినా దాని ప్రభావం కూటమి ప్రభుత్వం పైపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, కుడుపూడి సత్తిబాబు, యిన్నమూరి దీప్తి, నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కోటసత్తెమ్మ ఆలయం నుంచి నంగాలమ్మ తల్లికి సారె చీరలు తీసుకు వెళుతున్న మంత్రి దుర్గేష్

రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

● మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జూలై 31: నిడదవోలు గ్రామదేవత నంగాలమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరి గిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతికి సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలో దేవదాయ, ధర్మాదాయశాఖ అధికార్ల ఆధ్వ ర్యంలో నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామం లోని కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానం నుంచి నంగాల మ్మ తల్లి అమ్మవారికి చీర సారె కావిడి తీసుకువెళ్లారు. కార్యక్రమలో కోటసత్తెమ్మ తల్లి దేవస్థానం ఆలయ అధికా ర్లు నంగాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో గుబ్బాలమ్మ



గుబ్బాలమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

నిడదవోలు మండలం గోపవరంలో ఉన్న గుబ్బాల మ్మ అమ్మవారిని బుధవారం ఆషాఢమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు పండ్లతో శాఖాం బరిగా అ లంకరించారు. టీడీపీ నిడద వోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, గ్రామ సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, ఆరేపల్లి చిన నంగాలు, బూరుగుపల్లి శ్రీనివాస్, పంచదార దుర్గా ప్రసాద్ తదిత రులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామ దేవతకు ఆషాఢం సారె సమర్పణ



చీపురుగూడెం గ్రామ దేవతకు ఆషాఢం సారె, చీరలు సమర్పిస్తున్న భక్తులు

నల్లజర్ల, జూలై 31 : నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామ దేవత తుమ్మ లమ్మ తల్లి అమ్మవారికి గ్రామస్తులు ఆషాఢ మాసం సారె, చీరలు సమర్పించా రు. బుధవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని మేళాతాళాలతో గ్రామం లోని అన్ని దేవాలయాలను దర్శించుకున్నారు. ఈ ఏడాది గ్రామంలో సమృద్ధిగా పంటలు పండాలని, గ్రామస్తులు అంతా ఆరోగ్యంగా ఉండాలని ఆయా దేవతల కు, దేవుళ్లను ప్రార్థించారు. అనంతరం 50రకాల పండ్లు,స్వీ ట్లు అమ్మవారికి స మర్పించారు. కార్యక్రమంలో తుమ్మలమ్మ ఆలయకమిటీ అధ్యక్షుడు చెల్లు వీర వెంకట్రావు, కూసంపూడి వెంకటేశ్వరరావు(బుజ్జి), టీడీపీ అధ్యక్షుడు చెల్లు పెద్ద రామన్న, వంట్ల పెద్ద రామన్న, కలగర చిన్న వెంకట్రావు, మద్దిపాటి సూర్యనారా యణ, విడియాల చిరంజీవి, చెల్లు రాజేశ్వరి, పద్మ, ఉదయలక్ష్మి, తలంశెట్టి అనురాధ, చిల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా గంగాలమ్మ ఊరేగింపు



దేవర పల్లి, జూలై 31: యర్నగూడెంలో గంగాలమ్మతల్లి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థు లంతా ఈ దైవ కార్యక్ర మంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గోపా లపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈ జాతర ప్రారం భోత్సవ కార్యక్ర మంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పుట్టింటివారైన సింహాద్రివారు ఆడపడుచు మెట్టింటి వారు ఉండవల్లివారు అమ్మవారి పొన్నులు ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, ప్రత్తిపాటి హరినాథ్, గద్దే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాల దివ్యాంగులకు చేయూతనివ్వాలి : పీడీజే

రాజమహేంద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల హక్కులను పొందకుండా ఉన్న బాల దివ్యాంగులకు సంబంధిత శాఖలు చేయూత ఇవ్వాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొ న్నారు. బాల దివ్యాంగుల హక్కుల పరిరక్షణపై వివిధ శాఖల ప్రభు త్వాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బాల దివ్యాంగులు విద్య, వైద్యం వంటి వాటికి దూరం కాకూడదన్నారు.ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, 3వ, 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌లు రమ్య, పి.బాబు,మానసిక వైద్య నిపుణులు డా.కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త రత్తయ్య మృతదేహానికి నివాళి



కుప్పాల రత్తయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే రామారావు

కొవ్వూరు, జూలై 31: జనసేన కార్యకర్త కుప్పాల రత్తయ్య మృతదేహానికి టూరిజం శాఖామంత్రి కందుల దుర్గేష్ నివాళులర్పించారు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చెందిన రత్తయ్య బుధవారం గుండెపోటుతో అకాల మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్, కొవ్వూరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావులు రత్తయ్య పార్థీవ దేహానికి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

డీడీవో కార్యదర్శిగా వెలుతున్న రఫీకి వీడ్కోలు

తాళ్ళపూడి, జూలై 31: తాళ్ళపూడి మండలం పోచవరం గ్రామంలో సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్ఎం రఫీకి కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం డీడీవో కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సచివా లయంలో అభినందన సభ ఏర్పాటుచేసి రఫీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇఎస్.రామలక్ష్మి, సర్పంచ్ కాకర్ల హేమలత, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి ఇన్‌చార్జి తహశీల్దార్‌గా భారతి బాధ్యతల స్వీకరణ

తాళ్ళపూడి, జూలై 31: గత ఎన్నికల ముందు బదిలీపై వచ్చిన తహసీల్దార్ శ్రీనివాసరావు బదిలీపై వెల్లగా డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పి.మోహన భారతిని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

'గౌరవప్రదమైంది ఉపాధ్యాయ వృత్తి'

దేవర పల్లి, జూలై 31: ఉపాధ్యాయవృత్తి ఎంతో గౌరవ ప్రదమైందని విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లిలో అంబటి సత్యనారాయణరావు జడ్పీ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు హంస్సే శంకరుడు పదవీ విరమణ సంద ర్భంగా ఆయనను ఘనంగా ఎంపీపీ, జనసేన, టీడీపీ నాయకులు, ఉపాధ్యా యులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ దేశపౌరుడి దగ్గరనుంచి రాష్ట్రపతి వరకు ఉపాధ్యాయుల వద్ద విద్య నేర్చినవారే నని అన్నారు. జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు మాట్లాడుతూ శంకరుడు మాస్టరు 37సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా ఎన్నో సేవలందించారని అన్నారు. ఎంఈవో అప్పారావు, టీడీపీ నాయకులు హ రికృష్ణ, సుంకర దుర్గారావు, బళ్ళా సూర్య చక్రం, ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, టీడీపీ నేతలు కొయ్యలమూడి చినబాబు, జనసేన నాయకులు కంబాల సత్తిబాబు, జాజిమొగ్గల శ్రీనివాస్, సూరిశెట్టి బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ప్రాజెక్టు ఫెలోల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 31 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రూసా నిధులతో నిర్వహించబడుతు న్న పరిశోధనా ప్రాజెక్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని క ళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భౌతికశాస్త్రం, భూ విజ్ఞానశాస్త్రం విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రాజెక్టు ఫెలోల ని యామకానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత కల్గి న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీలోగా ఆన్‌లై న్‌లో సమర్పించాలన్నారు. దరఖాస్తు నమూనా, మరిన్ని వివరా లకు కళాశాల వెబ్‌సైట్‌లో సందర్శించాలన్నారు.

బొమ్మూరు డైట్ కళాశాలలో అరాచకం



రికార్డులను పరిశీలిస్తున్న విచారణ అధికారి మాధురి, పీడీ విజయకుమారి

● విద్యార్థినులపై లైంగిక వేధింపులు
● ఉన్నతాధికారులకు ఫిర్యాదు
● కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పీడీ విచారణ
● ఇద్దరు అధ్యాపకుల సస్పెండ్? ● ఇద్దరు సిబ్బందిపై చర్యలు
● అమరావతిలో రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, జూలై 31 : బొమ్మూరు డైట్ కళాశాలలో లైగింక వేధింపులపట్ల విచారణ జరిపి ఇద్దరు అధ్యాపకులను సస్పెండ్ చేసిన ట్టు తెలిసింది.తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు సుమారు 15 రోజుల కిందట డీఎడ్ కోర్సు చదువుతున్న విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కళాశాలలో ఇద్దరు అధ్యాపకులు, మరి కొంత మంది నాన్‌టీచింగ్ స్టాఫ్ కలిసి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు విద్యార్థినులు ఫిర్యాదు పేర్కొన్నా రు. ఈ విషయాన్ని డైట్ క్యాంపస్‌లోనే బయటపెట్టాలని ప్రయత్నించినా కొం తమంది నాన్‌టీచింగ్ స్టాఫ్ భయపెట్టడంతో వెనక్కితగ్గినట్టు తెలిసింది.దీంతో విద్యార్థినులు ఎవరికి తెలియకుండా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీ సుకువెళ్లారు. దీనిపై స్పం దించిన కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం విచారణకు ఆదేశించారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి కళాశాలలో విచారణ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి జరి గిన వాస్తవాలు తెలుసుకున్నారు. కళాశాలలో జరిగిన చాలా విషయాలు బయటకు వచ్చా యి. లైంగిక వేధింపులతో పాటు భవన నిర్మాణాల్లో అక్రమాలు ,టీపీడీ, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లో ఇద్దరు కింది స్థాయి ఉద్యోగుల అరాచకాలు, విద్యార్థినుల నుంచి అదనంగా ఫీజుల పేరుతో వసూళ్లు, మౌలిక సదుపాయాల లేమి వంటి అంశాలు బయటకు వచ్చాయి. ఆయా అంశాలపై విచారణ కొనసాగించారు. నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను విచారించారు. కళాశాల ప్రిన్సి పాల్ జయశ్రీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికారులకు ఆశ్రయించినట్టు విద్యార్థినులు తెలిపారు. కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు అటెండర్లు ప్రిన్సిపాల్‌నే బెదిరింపులకు గురిచేసిన సంఘటనలు జరిగినట్టు తె లిసింది. విచారణలో భాగంగా తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభ ద్రరావుల తీరుపై విచారణ అధికారిణి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రిన్సిపాల్ జయశ్రీ ఈ ఏడాది ఏప్రిల్‌లో కళాశాలకు ప్రిన్సిపల్‌గా వచ్చారు. విద్యార్థినులపై లైగింకవేధింపుల ఆరోపణల నేపథ్యంలో అమరావతిలో రిపోర్టు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిసింది. మరొక ఇద్దరు నాన్‌టీచింగ్ స్టాఫ్‌పై శాఖాపరమైన చర్యలకు ఆదేశాల్చినట్లు తెలిసింది. కళాశాలలో సరైన పర్యవేక్షణలేకపోవడం, భద్రత లేకపోవడం, అటెండర్లు నిబంధనలు పాటిం చకపోవడం విచారణ అధికారికి ఆశ్చర్యం కలిగించాయి. కళాశాలలో సుమారు 80 లక్షలతో చేపడుతున్న నాడు నేడు పనుల రికార్డులను తనిఖీ చేసి చేప ట్టిన పనులు పరిశీలించారు. అనంతరం విచారణ ఈ నివేదికను జిల్లా క లెక్టర్‌కు సమర్పించారు. వెంటనే కలెక్టర్ చర్యలు తీసుకున్నట్టు తెలిసింది.



కొవ్వూరుపాడు శివారు వెంకన్నచెరువు ముంపుతో చనిపోయిన వరి మొలకలు చూపుతున్న రైతులు

నిండా మునిగాం..

ఆదుకోవాలని రైతుల ఆందోళన

గోపాలపురం, జూలై 31: వెంకన్న చెరువు దిగువ భాగంలో నిర్మించిన చెక్‌డ్యామ్ ఎత్తును తగ్గించి ముంపునకు గురవుతున్న పంటలను కాపాడాలని ముంపు బాధిత రైతులు బుధవారం చనిపోయిన మొలకలు చూపిస్తూ పంటచేలలోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న చెరువు అయకట్టు ఎగువ భాగంలో ఉన్న ముంపు బాధిత రైతులు విలేఖర్లతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కొవ్వూరుపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న వెంకన్నచెరువు దిగువ భాగంలో నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తు పెంచి నిర్మించటంతో ప్రతీఏటా సుమారు 20మంది రైతులకు చెందిన 30 ఎకరాల పంట నీటమునుగుతు ందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ ఫలితం దక్కలేదన్నారు. దీంతో వెంకన్నచెరువు ఎగువ భాగంలో ఆరు ఎకరాల చెరుకు, 24 ఎకరాల వరి, నీటమునిగిపోయి చనిపోతుంద న్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెంకన్న చెరువు నిండిపోయి దిగువభాగంలో ఉన్న పంట నీటమునిగింద న్నారు. అధికారులు స్పందించి చెక్‌డ్యాం ఎత్తు తగ్గించి నీటమునిగిన పంటను కాపాడాలని బాధిత రైతాంగం పాలకులను కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు నరసింహమూర్తి, శ్రీరామమూర్తి, జక్కు శ్రీను, జక్కు సుబ్బాయమ్మ, బుర్రి సుబ్బలక్ష్మి, కొండా గవరమ్మ, జక్కు వెంకటస్వామి, జక్కు సుబ్బారావు, తదితర రైతులు నిరసన చేపట్టిన వారిలో ఉన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

● మంత్రి కందుల దుర్గేష్ హామీ

పెరవలి, జూలై 31 : ఇటీవల భారీ వర్షాలకు, గోదావరి వరదలకు నష్టపో యిన రైతుల, ప్రజలను ఆదుకుంటామని రాష్ట్రమంత్రి దుర్గేష్‌హామీ ఇచ్చారు. పెరవలిలో కుమ్మరి శాలివాహన సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్య క్షుడు పసలపూడి భద్రయ్య ఇంటివద్ద ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక విలేకరులతో కొద్దిసేపు మాట్లాడారు. భారీ వర్షాలకు ఎర్రకాలువ పొంగి సుమారు 9 నియోజకవర్గాల్లో ప్రభావం చూపుతుందని నిడదవోలు నియోజక వర్గ పరిధిలోని 26 వేల ఎకరాలు వరి చేను నీట మునిగాయన్నారు. భవిష్య త్తులో వరదలవల్ల రైతులకు నష్టం లేకుండా కాలువకు ఇరువైపులా గట్లు ఎత్తు పెంచేలా మోడరైజేషన్ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలి పారు. ఇటీవల భారీ వర్షాలు వల్ల గోదావరి వరదలవల్ల ఈ ప్రాంతంలోని రై తులకు కూలీలకు వ్యవసాయ పనులులేక నష్టపోయారని వారికి కూడా ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తె లిపారు. గతంలో వరద నీటితో నీటమునిగిన కుటుంబాల వారికి మాత్రమే నిత్యావసర వస్తువులు అందజేశామని వారు కాకుండా మరో 4 వేల కుటుం బాలకు కూడా నిత్యావసర వస్తువులు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంవల్లే నిర్లక్ష్య వైఖరితో కాకుండా ప్రస్తుత ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరిం చడానికి కృషి చేస్తుందని దీనిని ప్రజలు కూడా గమనిస్తారని పేర్కొన్నారు. రాబోయే నెలలో ఒకటవ తేదీన అర్హులైన వారందకీ పెన్షన్ ఇచ్చేలా అధికారు లను సమాయత్తం చేశామని తెలిపారు. అనర్హుల పెన్షన్‌లు తొలగించడానికి రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించడానికి ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు వేగవంతంగా జరుగుతుందని గతంలో నియోజకవర్గంలో ఐదువేలు మాత్రమే జనసేనసభ్యత్వాలు ఉండగా ప్రస్తుతం 12,600లకు సభ్యత్వాలు నమోదయ్యా యని ఇంకా వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రతీ జనసేన క్రియాశీలక సభ్యుడు 500 చెల్లిస్తే ఏదైనా అనుకోని ప్రమాదంతో గాయపడితే ఆసుపత్రి ఖర్చులకు 50వేల వరకు ఆర్థిక సాయం అం దుతుందని అనుకోని మరణం సంభవిస్తే ఆ కుటుంబానికి 5లక్షలు బీమా అందుతుందన్నారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘ జిల్లా అధ్యక్షుడు పసలపూడి భద్రయ్య, మండల జనసేన అధ్యక్షుడు పిప్పర రవి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకం

నిడదవోలు, జూలై31: ప్రతివిద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహిం చేందుకు నిర్ధేశించుకున్న రంగంలో నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవడానికి ఇంటర్మీ డియట్ విద్యే ఎంతో కీలకమని రాష్ట్ర పర్యాటక సాంస్కృ తికి సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థినీలకు పుస్తకాలు పంపిణీ చేశారు.ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశలో రెండేళ్లపాటు క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం రాబోయే 50 ఏళ్ల మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతుందన్నారు. ప్రతి విద్యార్థిని ముందున్న లక్ష్యంతో విద్యను అభ్యసించాలన్నారు. క్రమశిక్షణ కమ్యునికేషన్ స్కిల్స్ సబ్జెక్ట్ మీద అవగాహన తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బిగీతాంజలి, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఏపీఎస్ఎస్ సుబ్రహ్మ ణ్య, ఎస్.సుభాషిణి, కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్ పాల్గొన్నారు.



నిడదవోలులో విద్యార్థినీలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



తీపర్రులో జారిపడిన వంతెన అప్రోచ్‌రోడ్డు పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

అప్రోచ్ రోడ్డు పరిశీలన

పెరవలి, జూలై 31 : నిడదవోలు-నరసాపురం కాలువ పై తీపర్రు వద్ద గల వంతెన అప్రోచ్ రోడ్డు కాలువలోకి జారిపడటంతో రాష్ట్ర మంత్రి దుర్గేష్ బుధవారం దానిని పరిశీలించారు. ఒక కార్యక్రమం నిమిత్తం ఇటుగా వెలు తున్న దుర్గేష్‌కు తీపర్రు గ్రామస్తులు ఈ సమస్యను తీసుకెళ్లడంతో ఆయన వెంటనే ఆగి పరిశీలించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. ఈ వంతెన మీదుగా ప్రతీ నిత్యం లారీలు, బస్సులు, ఆటోలు కార్లు ప్రయాణిస్తుంటాయని సుమారు చుట్టుపక్కల పది నుంచి పదిహేను గ్రామాల ప్రజలకు ఈ వంతెన ప్రధాన ఆధారమన్నారు. ఇటువైపు గ్రామాల ప్రజలు తణుకు వెళ్లాలంటే ఈ వంతె న మీదుగా వెళితే దగ్గర మార్గమని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తాడిపర్రు వైపుగా గల రోడ్డు కాలువలోకి దిగబడిపోవడంతో ఎపుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతు న్నారు. దీంతో ఈ సమస్యకు ప్రస్తుతానికి తాత్కాలిక చర్యలు చేపట్టి అనంత రం రాబోయే వేసవిలో కాలువలు కట్టి వేసిన అనంతరం శాశ్వత చర్యలు తీ సుకుంటామని మంత్రి దుర్గేష్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమం లో తీపర్రు గ్రామ ప్రముఖులు బోగవల్లి చంటిబాబు, ప్రతిపాటి ప్రసాద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

తాళ్ళపూడి, జూలై 31: పర్యావరణాన్ని కాపాడి ప్రజలకు మేలు కలిగే విధంగా ప్రతిఒక్కరూ మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని కొ వ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. ఎంఆర్‌ఈజీఎస్ ద్వారా ప్రతి పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గజ్జరం, అన్నదేవ రపేట గ్రామాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమా నికి ఎమ్మెల్యే విచ్చేసారు. విచ్చేసిన ఎమ్మెల్యేను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఉపాధ్యాయుల కొరత తీరే విధంగా కృషి చేస్తానని ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం త్వరలోనే అమలు చేస్తామని, అలాగే పాఠశాలల్లో తరగతి గదుల కొరత లేకుండా చూస్తానని తెలిపారు. గజ్జరం హైస్కూల్‌లో ప్లే గ్రైండ్ ఆట లకు అనువుగా లేదని తెలుపగా గ్రౌండ్ లెవిలింగ్ చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, కాకర్ల వంశీ, దండమూడి శేషు, గన్నిన సత్తిబాబు, మద్దుకూరి పెద్దబ్బులు, కొర్లపాటి దత్తుడు, లింగాచారి, కొరారు వెంకట్రావు, చెవ్వూరి బంగా రాజు, కలిశెట్టి సన్యాసినాయుడు, సర్పంచ్‌లు గండి రాంబాబు, ఎలిపే సుధారాణి, ఎంపీపీ జె.పోసిరాజు యువగళం టీం కూచిపూడి గణపతి, తొండెపు భరత్, ఎంఆర్‌ఈజీఎస్ ఏపీవో రమాదేవి, టిడిపి, జనసేన, బిజేపి పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు కౌన్సిల్ హాలులో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఫొటోలు



నిడదవోలు పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి దుర్గేష్‌ల ఫొటోలు

నిడదవోలు, జూలై 31: "ప్రభుత్వం మారింది మీరు మారరా" అంటూ సోమ వారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులె స్పందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు దాటినా పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి దుర్గేష్‌ల ఫొటోలు ఏర్పాటు చేయకపోవడంపై ఆంధ్ర జ్యోతి కథనం ప్రచురించింది. దీంతో అధికారుల్లో చలనం వచ్చింది. బుధవారం కౌన్సిల్ హాలులో ఫొటోలు ఏర్పాటుచేశారు.

● చైర్మన్ ఫొటోకు రూల్ పొజిషన్ ఉందా?

నిడదవోలు పురపాలక సంఘం కౌన్సిల్ హాలులో ఎప్పుడూ లేని విధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఫొటోకు స్థానం కల్పించారు.ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అధికారుల తీరులో మార్పురాలేదు.ఇప్పుడు కూడా మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఫొటో ఏర్పాటుచేశారు. జిల్లాలో ఏ మునిసి పాలిటీలోను లేని విధంగా గత ఒరవడినే కొనసాగిస్తూ నిడదవోలు పురపాలక సంఘ అధికారు లు స్వామిభక్తి చాటుకుంటున్నారు. చైర్మన్ ఫొటో ఏర్పాటు పై మునిసిపల్ కమిషనర్ రామ్‌భూపాల్‌ను వివరణ కోరగా.. రూల్ పొజిషన్ చెప్పడం మానేసి వైసీపీ ప్రభుత్వంలో ఉంది కదా దానినే కొనసాగించాం అని చెప్పడం కొసమె రుపు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కొందరు అధికారులు వైసీపీ ప్రజాప్రతినిధులకే అనుకూలంగా పనిచేస్తున్నారనేదానికి ఇదే నిదర్శనం.

ఆదర్శ పట్టణంగా కొవ్వూరును తీర్చిదిద్దాలి : ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు లో పారిశుధ్య సిబ్బందికి సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 31: ఆదర్శవంతమైన పట్టణంగా కొవ్వూరు మున్సిపాల్టీని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి పారిశుధ్య పనిముట్లను, చెత్త సేకర ణకు సంబంధించి తోపుడు బండ్లను ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షత న బుధవారం పంపిణీ చేశా రు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కార్మికులకు పారిశుధ్య నిర్వహణకు, ఇంటి ంటా చెత్త సేకర ణకు అవసరమైన సామాగ్రిని అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఎన్ని కల ప్రచారంలో పట్టణంలో పర్యటించిన సమ యంలో ఎక్కడికి వెళ్లిన ప్రజల నుంచి తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవ స్థపై ఫిర్యాదులు వచ్చాయి. కూటమి ప్రభు త్వం ఏర్పడిన గత రెండు నెల లుగా పట్టణంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణకు సంబ ంధించి సిబ్బందికి పనిముట్లు కొరత అధికంగా ఉందని గమనించి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి, కమిషనర్, టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని, ఇతర అధికారులతో సమీక్షిస్తామన్నారు. వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ సాధారణ నిధులతో పనిముట్లు కొనుగోలుచేసి అందించడం జరిగిందన్నారు. సిబ్బంది పట్టణంలో ఎక్కడా పారిశుధ్య సమ స్యలు తలెత్తకుండా తమ బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్లు బొండాడ సత్యనారాయణ, కండెల్లి రామారావు, కిలాని వెంకటలక్ష్మి, బోడపాటి ముత్యాలరావు, అర్థిల్లి రామకృష్ణ, పెనుమాక జయరాజు, మున్సిపల్ మేనేజర్ జి. రాధాకృష్ణ, అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

● 12.10 అడుగుల వద్ద 15గంటలుగా నిలకడగా నీటిమట్టం
● 10.41లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
● కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం, జూలై31: ధవళేశ్వరంవద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతుంది. బుధవారం తెల్లవారుజామున 4గంటలకు 12.10అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం ఆపై 15గంటలుగా నిలకడగా కొనసాగుతోంది. ఈ సమయంలో కాటన్‌బ్యారేజ్ నుంచి 10,41,489 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. రాత్రి 12 గంటలకు నీటిమట్టం నిలకడగా 12.10 వద్ద కొనసా గుతోంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం తగ్గకుండా నిలకడగా ఉంది. గురువారం ఉదయం వరకు నీటి మట్టం నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టవచ్చని ఆపై గంటల వ్యవ ధిలోనే మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించేస్థాయికి నీటిమట్టం తగ్గుతుందని అధికారులు అంచనా. ఎగువన భద్రాచలం వద్ద మంగళ వారం అర్ధరాత్రి వరకు పెరిగిన నీటిమట్టం 45.10అడుగుల వరకు చేరుకుని కొద్ది గంటలు నిలకడగా ఉండి ఆపై తగ్గుముఖం పడుతుంది. బుధవారం రాత్రి 12 గంటలకు నీటి 44.60అడుగులుగా నమోదైంది.

● ఎగువ ప్రాంతాల్లో తగ్గుతున్న నీటి మట్టం

ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. బుధవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 9.85మీటర్లుగా నీటి మట్టం నమోదుకాగా, పేరూరు వద్ద 15.48మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 12.17మీటర్లు, భద్రాచలం వద్ద 44.70 అడుగులు, కూనవరం వద్ద 19.06మీటర్లు, కుంట వద్ద 10.37మీటర్లు, పోలవరం వద్ద 12.36 మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.12మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

ఎరువుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి

● రాష్ట్రీయ ఎరువుల నియంత్రణ ప్రయోగశాల ఉపసంచాలకులు అరుణ్



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

రాజమహేంద్రవరంరూరల్, జూలై 31: కేంద్రప్రభుత్వ ఎరువుల నియంత్ర ణ చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయడం ద్వారా నకిలీ ఎరువులు, పురు గుమందులను నియంత్రించ వచ్చని భారత ప్రభుత్వ రాష్ట్రీయ ఎరువుల నియంత్రణ ప్రయోగశాల ఉపసంచాలకులు అరుణ్ అన్నారు. రాజమహేంద్ర వరంలో 3రోజులపాటు 13 జిల్లాల మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరుణ్ మాట్లా డుతూ మండలంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను నిత్యం పర్య వేక్షించి రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందేలా వ్యవ సాయ అధికారులు కృషి చేయాలన్నారు ప్రతీ దుకాణంవద్ద నిల్వ బోర్డులు ప్రద ర్శించాలని సంబంధిత రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. వ్యవ సాయశాఖ అదనపు సంచాలకులు కృష్ణదాసు మాట్లాడుతూ మండల వ్యవ సాయ అధికారులు, ఆయా మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల న్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త శిక్ష ణకు జిల్లాకు అవకాశం కల్పించ డం ఆనందం అన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు గంగాధర్, ఎరువుల నియంత్రణ చట్టంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ శిక్షణార్థులకు అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం, కోరుకొండ ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, మల్లిఖార్జునరావు, ఏవోలు భీమరాజు, శ్రీనివాస్, సూర్యరమేష్,ఆలీవ్, వాణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

దేవర పల్లి, జూలై 31: సేంద్రీయ ప్రకృతి వ్యవసాయం వలన అధిక దిగుబడులు సాధించటంతో పాటు భూసా రాన్ని పెంపొందించుకోవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఈ.కరుణశ్రీ, డాక్టర్ ఎం.రాఘవేంద్రారెడ్డి అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో బుధవారం వైఎస్సార్ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరామన్నగూడెం సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ విస్తర్ణ పథకంలో భాగంగా దుద్దుకూ రులో రైతులకు 2రోజులపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులకు సేంద్రీయఎరువుల వినియోగంపై అవగాహన కల్పించా రు. వ్యవసాయ భూమిలో పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర, మొదలైన పంటలు పండించి దుక్కులో కలియదున్నాలని దీని వలన భూసారం పెంపొందుతు ందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఎరువుల తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.చిరంజీవి, జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ మేనేజర్ తాతారావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సోమిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.